J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 14 04.9.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# చివరికి మిగిలేది..ఆ ఇద్దరేనా?



## వైఎస్సార్‌సీపీలో సంక్షోభం

### కీలక నేతల పక్కచూపులు

### బీజేపీలోకి పెద్దిరెడ్డి.. జనసేనలోకి బొత్స?

### స్థానిక సంస్థల ఎన్నికల వేళ కలవరం

### విజయసాయిరెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్న పార్టీ శ్రేణులు



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడ ఏకగ్రీవం జరిగినా.. ఆ నియోజకవర్గ సమన్వయకర్తకు వచ్చే ఎన్నికల్లో సీట్ ఫట్. ఇదీ... వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ నాయకులకు ఇటీవల చేసిన హెచ్చరిక. అయితే ఈ విషయం ఇప్పుడు పెద్ద కల్లోలానికే దారితీసే పరిస్థితి కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా సామదానభేద దండోపాయాలు ఉపయోగించి, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులను ఏకగ్రీవాలతో అందలం ఎక్కించి, ప్రజాస్వామ్యాన్ని జగన్ అండ్ కో ఖూనీ చేసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ప్రస్తుతం పార్టీ ఉనికే ప్రశ్నార్థకమైన నేపథ్యంలో స్థానిక సమరంలో ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ఎలాగైనా పార్టీ శ్రేణుల్లో మళ్లీ జవసత్వాలు నింపాలని జగన్ యోచిస్తున్నట్లు తెలిసింది. 2లో

**తిరుమల వార్తపై అనూహ్య ప్రతిస్పందన**

**భక్తమహాశయుల హృదయస్పందన** 5లో

పాఠకులకు, ప్రకటనకర్తలకు,
చందాదారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు
సం/-



# చివరికి మిగిలేది.. ఆ ఇద్దరేనా?

(మొదటిపేజీ తరువాయి)



ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీకి పలువురు గుడ్‌బై చెప్పేందుకు సన్నద్ధమైనట్లు తెలిసింది. ఈ కోవలో కొందరు కీలక నేతలు కూడా ఉన్నారనే ప్రచారం ప్రస్తుతం రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారింది.

## పైకి చెప్పలేక లోలోన మదనపడుతూ..!

2024 ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన వైఎస్సార్‌సీపీలో వైఎస్ జగన్‌తో పాటు మరో 10మంది మాత్రమే బొటాబొటి మెజారిటీతో గట్టెక్కారు. మిగిలిన మంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు చిత్తు చిత్తుగా ఓడిపోయారు. గెలిచిన వారిలో జగన్ కాకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమే గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. మిగిలిన తొమ్మిది మంది తొలిసారి గెలిచిన వారే. వారికి రాజకీయ, శాసన, కార్యనిర్వాహక విభాగాల్లో పెద్దగా పట్టు లేదు. దీనికితోడు 2024 నుంచి ఇప్పటి వరకు వారు శాసనసభ సమావేశాలకు వెళ్లకుండా నియోజకవర్గానికే పరిమితమవుతున్నారు. దీనికితోడు తమ సొంత నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వ అండతో కూటమికి చెందిన సమన్వయకర్తల హవానే నడుస్తుండడంతో వారు ప్రజాప్రతినిధులన్న పేరుతో ఉత్సవ విగ్రహాల్లాగానే మిగిలిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పార్టీ అధినేత జగన్ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా పార్టీ అభ్యర్థిని నిలబెట్టాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో సీటు దక్కదని స్పష్టం చేయడంతో వారంతా లోలోన మదనపడుతున్నట్లు తెలిసింది.

## అసెంబ్లీ ఆశ ఎండమావేనా..?

కొత్త ప్రభుత్వం వచ్చి రెండేళ్ల నాలుగు నెలలు పూర్తయ్యింది. మరో మూడేళ్ల కాల వ్యవధి ఉంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ తరపున ఎన్నికైన ఎమ్మెల్యేలు ఇకపై కూడా శాసనసభకు వెళ్లే అవకాశాలు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. తద్వారా కొత్తగా ఎన్నికైన వారికి అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలు లేవనెత్తాలనే కల ఇక కలగానే మిగిలిపోయే అవకాశం ఉంది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు వైఎస్సార్‌సీపీ తరపున గెలిచిన వారిలో వైఎస్ జగన్ తర్వాత సీనియర్ మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రస్తుతం భారతీయ జనతాపార్టీవైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈయన కుమారుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రాజంపేట ఎంపీగా ఉన్నారు. వీరికి వ్యాపారాలు, కాంట్రాక్టు సంస్థలు అధికంగా ఉండడంతో దక్షిణభారతంలోనే కాకుండా ఉత్తరాది రాష్ట్రాల్లోనూ పెద్దఎత్తున వీరి కాంట్రాక్టు పనులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో బిల్లుల మంజూరు, పనుల కేటాయింపు వంటి విషయాల్లో సత్సంబంధాలు ఎంతైనా అవసరం. తద్వారా వ్యాపార విస్తరణకు, అలాగే కేసుల నుంచి బయటపడేందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కమలం పార్టీ ఒక్కటే ప్రత్యామ్నాయం అని అయన భావిస్తున్నట్లు తెలిసింది. తన సొంత నియోజకవర్గం పుంగనూరుతో పాటు తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, అన్నమయ్య జిల్లాల్లో పెద్దిరెడ్డి ఆక్రమణలకు తెగబడ్డారనే ఆరోపణలు భారీగానే ఉన్నాయి. అటవీ భూములు, చెరువు పోరంబోకు, డీకేటీ పొలాలు, ఇళ్ల స్థలాలను ఆయన, ఆయన అనుచరులు పెద్దఎత్తున కబ్జా చేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిన్నింటి నుంచి బయటపడాలంటే బీజేపీలోకి జంప్ కావడమే ఉత్తమమని ఆయన వ్యూహాలు రచిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక ఉత్తరాంధ్రలో వైఎస్సార్‌సీపీకి పెద్దదిక్కుగా, ప్రస్తుత శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా, మాజీ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన బొత్సా సత్యనారాయణ కూడా త్వరలో పార్టీ మారనున్నట్లు ప్రచారం జోరందుకుంది. ఆయన పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన తీర్థం పుచ్చుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే విషయంపై పూర్తి స్పష్టత లేకపోయినా వైఎస్ జగన్ తీరుపై కొందరు సీనియర్లు, ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారనేది బహిరంగ రహస్యంగా కనిపిస్తోంది.

## 11 మందిలో 10 మంది బైబై!

వైఎస్సార్‌సీపీ తరపున గెలిచిన వారిలో పెద్దిరెడ్డితో పాటు ఆయన తమ్ముడు తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మంత్రాలయం వై. బాలనాగిరెడ్డి కూడా జనసేన, బీజేపీ అధిష్టానాలతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. దీంతో వైఎస్సార్‌సీపీలో కలవరం మొదలైనట్లు ప్రచారం సాగుతోంది. ఇక ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తా ప్రాంతానికి చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం వివిధ పార్టీలతో సంప్రదింపులు జరుపుతుండడంతో జగన్ పార్టీలో త్వరలోనే భారీ కుదుపు తప్పదనే ప్రచారం జోరందుకుంది.

## మిగిలేది ఆ ఇద్దరేనా..?

ఇప్పటికే పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఇసుక, లిక్కర్, మట్టి, దౌర్జన్యాలు, భూ కబ్జాలు వంటి కేసుల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. మరికొందరు లోకేష్ రెడ్‌బుక్ బారినపడి ఊచలు లెక్కిస్తున్నారు. ఇంకొందరు కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బలవంతంగా బరిలోకి దింపితే మరిన్ని కేసులు తప్పకపోవచ్చనే భయంతో ఆయా నియోజకవర్గాల ద్వితీయ శ్రేణి నేతలు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. సరిగ్గా ఇదే సమయంలో తమ పార్టీ అధినేత జగన్ ఎక్కడా ఏకగ్రీవాలు జరగకూడదని, అధికార కూటమి నేతలతో సై అంటే సై అనేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో దిగాలని స్పష్టం చేయడంతో ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. అధికారంలో ఉన్నప్పుడు అన్ని అధికారాలు తన కోటరీకి అప్పగించి తమను జగన్ ఉత్సవ విగ్రహాలుగా చేశారని ఫలితంగా అప్పట్లో సంపాదించుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని పలువురు నేతలు వాపోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు మొత్తం ఆర్థిక భారాన్నంతా తమపై నెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోరాడాలంటే ఎలా వీలవుతుందని వారు అంతర్గతంగా మథనపడుతున్నట్లు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీలో ఉంటూ అవస్థలు పడే బదులు ఇతర పార్టీల కండువా కప్పుకోవడమే బెటర్ అనే నిర్ణయానికి పలువురు నేతలొచ్చినట్లు ప్రచారం ఊపందుకుంది. ఇదే నిజమైతే ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు కీలక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ పార్టీకి టాటా చెప్పడం తథ్యంగా కనిపిస్తోంది. అదే జరిగితే అధినేత జగన్, పార్టీలో సామంతరాజైన సజ్జల మాత్రమే వైఎస్సార్‌సీపీకి దిక్కుగా మారుతారని పలువురు విశ్లేషకులు, విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఏదేమైనా గతంలో తాను అధికారంలో ఉండగా 23శాతం వరకు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఛైర్మన్ పదవులను నయానో భయానో ఏకగ్రీవం చేసుకున్న జగన్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ ఎక్కడా ఏకగ్రీవమన్నదే జరగకూడదని, అలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించడం ఆయన ద్వంద్వ వైఖరికి, రెండునాల్కల ధోరణికి నిదర్శనంగా కనిపిస్తోంది.

అయితే, ఇటీవల వైసీపీ మాజీ నేత, జగన్‌మోహన్‌రెడ్డి పద్దులపెద్ద విజయసాయిరెడ్డి చేసిన ఘాటైన వ్యాఖ్యలు కూడా వైసీపీ శ్రేణుల్ని ఆలోచింపచేస్తున్నట్లు సమాచారం. వైసీపీలో సజ్జలే నెం.1, జగన్ నెం.2, అని సజ్జల గురించి సాయిరెడ్డి చేసిన ఆరోపణలలో నూటికి నూరు శాతం నిజం ఉన్నట్లు వారు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. తమ నాయకుడు మాత్రం సజ్జల నీడలోనే పార్టీని నడుపుతుండడం వైసీపీ నేతలకి మింగుడుపడడం లేదని ఓ వైసీపీ నేత వ్యాఖ్యానించడం ఇక్కడ గమనార్హం. పార్టీకి శనిలా దాపురించిన వ్యక్తి కనుసన్నలలో తమ నాయకుడు నడుస్తున్నాడని, భవిష్యత్తులో దాని పర్యవసానం జగన్‌రెడ్డితో పాటు తామంతా అనుభవించాల్సొస్తుందని ఆ నేత విచారాన్ని వ్యక్తం చేస్తున్నాడు.

మరి, తమ నాయకుడు ఇప్పటికైనా మేల్కొని సజ్జలని దూరంపెట్టి పార్టీని కాపాడుకుంటారో లేక ఎప్పటిలా సజ్జల సలహాలకే పరిమితమై ప్రతిపక్ష హోదా కూడా లేకుండా మిగిలిపోతారో కాలమే నిర్ణయించనుంది..!

# గణేష్ ఉత్సవ సమితి సమావేశం



సమావేశంలో పాల్గొన్న గణేష్ ఉత్సవ సమితి సభ్యులు

నెల్లూరులోని విక్రమసింహపురి గణేష్ ఉత్సవ సమితి సమావేశం ఈనెల 2న జరిగింది. ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న వినాయకచవితి ఉత్సవాల ఏర్పాట్లపై సమితి గౌరవాధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు ఆధ్వర్యంలో సమీక్షించారు. సమితి జిల్లా అధ్యక్షుడు వాయుగుండ్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బయ్యా వాసు, నగర అధ్యక్షుడు కొండపల్లి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి టి.భాస్కర్‌రెడ్డి, గౌరవ సలహాదారు పి.సురేంద్రరెడ్డి పాల్గొని ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఈనెల 5న ట్రంకురోడ్డులోని టీవీఎస్ కల్యాణసదన్‌లో సమితి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని, తాత్కాలిక వినాయక విగ్రహాల ప్రతిష్ఠ, మండపాల నిర్వాహకులు సింగిల్‌విండో విధానంలో పోలీసుల అనుమతి కోసం కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వేలూరు మహేష్, మండ్ల ఈశ్వరయ్య, కప్పిర శ్రీనివాసులు, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, ఎరబోలు రాజేష్, వి.హర్షవర్ధన్, ఏవీఆర్ మోహన్‌రావు, కేవీ మురళీకృష్ణ, శివకుమార్‌ఆచారి, మొగరాల సురేష్, ఫణిరాజు, కేవీ సుబ్రహ్మణ్యం, ఎన్. శ్రీనివాసులునాయుడు, మహేష్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డా. కిషోర్స్ రత్నంలో..కృష్ణాష్టమి సంబరాలు



గోపికల వేషధారణలతో డా. కిషోర్స్ రత్నం చిన్నారులు

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 3న నెల్లూరులోని సరస్వతి నగర్‌లో ఉన్న డా.కిషోర్స్ రత్నం విద్యార్థులు పండుగను వేడుకగా నిర్వహించుకున్నారు. శ్రీకృష్ణుడు-రాధ, గోపికల వేషధారణతో విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. కృష్ణాష్టమి విశిష్టతను గురించి విద్యార్థులు ప్రసంగించారు. భగవద్గీత శ్లోకాలను పఠించారు. నృత్యగానాలతో సంబరాలు చేసుకున్నారు. డా.కిషోర్స్ రోషిణి రత్నం అడ్వాన్స్‌డ్ ఒలింపియాడ్ స్కూల్, డా. కిషోర్స్ రత్నం ఒలంపియాడ్ స్కూల్, డా. కిషోర్స్ రత్నం రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జిల్లా జడ్జికి..కమిషనర్ శుభాకాంక్షలు



నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల నియమితులైన ఏ. నరసింహామూర్తిని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఈనెల 2న మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నెల్లూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఆయన ఛాంబర్‌లో కలసి, ప్రధాన న్యాయమూర్తికి శుభాకాంక్షలు చెప్పారు.

# బాధ్యతలు చేపట్టిన కొత్త డీపీఓ



జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా నియమితులైన బీకేఎస్ఎస్ వెంకటరామన్ ఈనెల 2న నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. నరసాపురం డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న ఆయన్ను ఇటీవల నెల్లూరులో డీపీఓగా నియమించారు. ఇక్కడ రెగ్యులర్ డీపీఓగా ఉన్న ఎల్.శ్రీధర్‌రెడ్డి జడ్పీ సిఈఓగా నియమితులు కావడంతో ఆ స్థానంలో జిల్లా స్వర్ణగ్రామ-స్వర్ణ వార్డుల అధికారిణిగా ఉన్న వసుమతిని ఇన్‌ఛార్జిగా నియమించారు. తాజాగా ఈ స్థానంలో వెంకటరామన్ నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కొత్త డీపీఓకి ఆయన కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు చెప్పారు.

వెలిగొండతో..

# నెల్లూరు మెట్ట ప్రాంతాలకు జలకళ



## ఉదయగిరి అభివృద్ధికి కొత్త బాట..
## సాగు, తాగునీటికి
## శాశ్వత పరిష్కారంపై ఆశలు

మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం ప్రారంభించడం నెల్లూరు జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు కూడా కొత్త ఆశలు కలిగించింది. ముఖ్యంగా ఉదయగిరి నియోజకవర్గానికి వెలిగొండ జలాలు అందుబాటులోకి వస్తే సాగు, తాగునీటి సమస్యలకు గణనీయమైన పరిష్కారం లభించే అవకాశం ఉంది. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడుతున్న ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు తదితర ప్రాంతాలకు సాగునీటి లభ్యత పెరిగితే వ్యవసాయ భూముల ఉత్పాదకత పెరగడంతో పాటు పంటల వైవిధ్యానికి అవకాశం ఏర్పడుతుంది.

ఉద్యాన పంటలు, పశుపోషణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అభివృద్ధి చెందితే రైతుల ఆదాయం, స్థానిక ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉంది. సాగునీటితో పాటు తాగునీటి సమస్యకు కూడా వెలిగొండ కీలక పరిష్కారంగా మార నుంది. వేసవిలో నీటి కోసం ఇబ్బందులు పడే గ్రామాలకు శాశ్వత నీటి వనరు అందుబాటులోకి రావడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేయనుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలైతే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, దాదాపు 23 లక్షల మందికి తాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తొలి దశలోనే 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించే ప్రక్రియ ప్రారంభమైంది

### ఉదయగిరి రైతుల జీవితాలలో వెలుగు!

వెలిగొండ ప్రాజెక్టుతో ఉదయగిరి ప్రాంతం రూపురేఖలు మారే అవకాశం ఉందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తై జాతికి అంకితం కావడంతో, ఉదయగిరి రైతుల జీవితాలలో వెలుగు నిండిందని కాకర్ల చెప్పారు. నీరు అందితేనే ఈ ప్రాంతంలో వ్యవసాయం బలోపేతం కావడంతో పాటు పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరుగుతా యని, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఇది కీలక మలుపుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అయితే ప్రాజెక్టు ప్రారంభంతోనే ప్రయోజనాలు పూర్తిగా అందినట్లు కాదు. నెల్లూరు జిల్లాకు కేటాయించిన నీరు ఆయకట్టుకు చేరేలా కాలువల అనుసంధానం, పంపిణీ వ్యవస్థను సమర్థంగా అమలు చేయడం అత్యంత కీలకం.వెలిగొండ జలాలు జలాశయా లను నింపడంతో పాటు.. నెల్లూరు మెట్ట ప్రాంతాల్లో రైతుల ఆశలను, పొలాల్లో పచ్చదనాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చైత న్యాన్ని నింపినప్పుడే ఈ ప్రాజెక్టు లక్ష్యం సార్థకమవుతుంది.

# అవ్వాతాతల సంతోషం..ఎంతో సంతృప్తినిస్తోంది

## మంత్రి నారాయణ

పింఛను లబ్దిదారులైన అవ్వాతాతల కళ్ళలో ఆనందం చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ అన్నారు. ఈనెల 1న ఆయన నెల్లూరులోని 6వ డివిజన్ ఉడ్‌హౌస్ సంఘంలో లబ్దిదారుల ఇళ్ళ వద్దకు వెళ్ళి పింఛన్ల నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంతోషమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోందని, రాష్ట్రంలో ఏటా పింఛన్ల కోసం ప్రభుత్వం సుమారు 33వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. పింఛను, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, నారాయణ సైకిల్ వగైరాలన్నీ అందుతుండడంతో లబ్ధిదారులు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం



పింఛన్ అందజేస్తున్న మంత్రి నారాయణ, పక్కన మేయర్ సుజాత

చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు మూడు నెల లబకా యిలతో పాటు వృద్ధులు, వితంతువుల పింఛన్లను ఒకేసారి 4,000 రూపాయలకి, దివ్యాంగులకు 6,000కు, పూర్తి వికలాంగులకు 15,000కు, కిడ్నీ, కాలేయ వ్యాధిగ్రస్తులకు 10,000కు పెంచి క్రమం తప్పకుండా 1వ తేదీనే ఇంటి వద్దకే అందిస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 62 లక్షల కుటుంబాల కోసం ఏటా 33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు పింఛన్ల కోసం 73,594.44 కోట్ల రూపాయలను తమ ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. మనరాష్ట్రంతో పోల్చుకుంటే పొరుగు రాష్ట్రాలు సగం కూడా పింఛన్ ఇవ్వటం లేదని గుర్తుచేశారు. తెలంగాణలో 2016 రూపాయలు,తమిళనాడులో వెయ్యి రూపాయలు, కర్ణాటకలో 600 మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని చెప్పారు. నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలపై..సోమిరెడ్డి సమీక్ష



జిల్లాలో రెవెన్యూ సమస్యలపై ఈనెల 2న మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జిల్లా అధికారులతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ అనూషాతో కలిసి నెల్లూరు ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమీక్ష జరిపారు. వైసీపీ పాలనలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల పరిరక్షణపైనా, కోర్టు వివాదాలకు సంబంధించి సకాలంలో తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. రీసర్వేలో జరిగిన తప్పిదాలకు సంబంధించిన రైతుల వినతులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని జేసీని కోరారు.

# సేవా సుగంధాలకి పాతికేళ్ళు

## రజతోత్సవం జరుపుకోనున్న స్వర్ణభారత్

## ముఖ్యఅతిథిగా రానున్న ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్





భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి స్ఫూర్తితో ఆయన ముద్దుల తనయ దీప వెంకట్ సారథ్యంలో సేవా సామ్రాజ్యంలో పాతికేళ్లుగా గుబాళిస్తున్న "స్వర్ణభారత్ ట్రస్ట్" పాతికేళ్ల పండుగని ఆడంబరంగా జరుపుకో బోతోంది. సెప్టెంబర్ 7వ తేదీ సోమవారం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఉన్న ప్రజా మందిరం ఈ పాతికేళ్ళ సంరంభానికి వేదిక కాబోతోంది. ట్రస్టు స్ఫూర్తి ప్రదాత వెంకయ్యానాయుడుతో పాటు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ వేడుకలలో పాల్గొంటారు. వారితో పాటు ఇద్దరు జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా వేదికపై ఆసీనులు కానున్నారు. పాతికేళ్ళ క్రితం వెంకటాచలంలో పురుడు పోసుకుని అనంతరం హైదరాబాద్, విజయవాడలలో సైతం శాఖలని ప్రారంభించుకుని స్వర్ణభారత్ ట్రస్టు సేవా సామ్రాజ్యంలో ప్రకాశిస్తోంది. దేశంలోనే అత్యంత చరిష్మా కలిగిన ముఖ్యమంత్రిగా పేరున్న యోగి ఆదిత్యనాథ్ తొలిసారిగా జిల్లాకి వస్తుండడంతో అటు స్వర్ణభారత్ నిర్వాహకులు, జిల్లా బీజేపీ నాయకులు యోగి పర్యటనని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నారు.

పేద విద్యార్థుల విద్య-వసతి-వికాసం కోసం..

# కోటి రూపాయలు ప్రకటించిన వేమిరెడ్డి



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న సుమారు 19 వేల మంది విద్యార్థులకు మెరుగైన వసతి, విద్యా సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేపట్టిన విద్య–వసతి–వికాసం కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోటి రూపాయల విరాళం ప్రకటించారు. ఆగస్టు 31న నెల్లూరు కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని తమ విరాళం ప్రకటించడం విశేషం. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, తనవంతు సహకారంగా అందిస్తున్న కోటి రూపాయల విరాళంతో జిల్లాలోని 155 సంక్షేమ వసతిగృహాలకు అవసరమైన కంప్యూటర్లను కొనుగోలు చేసి అందజేస్తామని తెలిపారు. విద్యార్థుల కోసం కోటి రూపాయలు విరాళంగా అందించిన ఎంపీ వేమిరెడ్డికి కలెక్టర్ హిమాన్షు శుక్లా కృతజ్ఞతలు తెలిపారు.

# కలెక్టర్ హిమాన్షు శుక్లకి..బంగారుపతకం

- రెడ్‌క్రాస్‌లో సేవలకి గవర్నర్ అభినందన



రెడ్‌క్రాస్‌లో విశిష్ట సేవలందించినందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 1న బంగారు పతకం బహుకరించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్‌కి గవర్నర్ బంగారు పతకం అందజేసి అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉంచడంలో జిల్లా రెడ్‌క్రాస్ మంచి గుర్తింపును పొందింది. అంతేకాక, జిల్లా రెడ్‌క్రాస్ ద్వారా చేపట్టిన పలు సేవా కార్యక్రమాలు కూడా అందరి మన్ననలు అందుకుంటున్నాయి. జిల్లా కలెక్టర్‌కి 'లాయర్' అభినందనలు.

లాయర్
సెప్టెంబర్ 04, 2026

# శిథిల భవనాలు.. ప్రమాదాలకి ద్వారాలు!

'ఇంటిని.. ఇల్లాలిని కంటికిరెప్పలా బాగా చూసుకోవాలని' పెద్దలు చెప్తూ ఉంటారు. కొందరు తమ ఇళ్ళను ఎప్పటికప్పుడు చక్కదిద్దుకుంటూ ఉంటారు. మరికొందరు ప్రైవేటు వ్యక్తులు తమ మిద్దెలు మేడలు ఎక్కడా బీటలు పడకుండా తరచూ బాగుచేసుకుంటూనే ఉంటారు. కానీ, ప్రభుత్వాలే కోట్లాది రూపాయలు విలువచేసే తమ భవనాలు, సొంత ఆస్తుల పట్ల కూడా నిర్లక్ష్యం చేస్తున్నాయి. వంద సంవత్సరాలు, అంతకు పైబడి కట్టిన భవనాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుని పాడుబడిపోతున్నా, వాటిని బాగు చేసుకోవాలన్న ఆలోచనలే చేయడం లేదు. దేశవ్యాప్తంగా ఈ దుస్థితి ఉన్నా, ప్రత్యేకించి ఆంధ్రలోనూ ఈ దురవస్థ ఎంతో కాలంగా ఉంటోంది. ఒక పాఠశాల భవనం శిథిలమై, పెచ్చు లూడిపోయి ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంటే, అందులో చదువుకునే పసిపిల్లలు, ఉపాధ్యాయుల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించండి. ఏ ఆసుపత్రి భవనమో శిథిలావస్తకు చేరుకుని, ఎప్పుడు పడిపోతుందోనని రోగులు బిక్కుబిక్కుమంటూ కాలం గడపడం ఎంత దుర్భరమో యోచించండి!.. ఇలా రాష్ట్రంలో అనేక ప్రభుత్వ భవనాలు ఏళ్ళ తరబడి ఎలాంటి మరమ్మతులకు నోచుకోకుండా, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అందులో ఉన్న వాళ్ళు భయపడుతూనే విధులు నిర్వహించడం ఎంత దయనీయమో! ఎప్పుడో పాతకాలంలో కట్టిన భవనాలు కాలక్రమేణా పాతబడిపోతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉండడం విచారకరం!.. వాటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉంది. పైకప్పులు దెబ్బతినిపోయి, భవనాలు పగుళ్లబారి, చిన్నవానకే ఉరుస్తూ, కార్యాలయాల్లోకి అడుగు పెట్టాలంటేనే ఇబ్బందిగా ఉంటే ఎలా?.. పాతబడ్డ భవనాల్లో విద్యుత్ వైరింగులు పాడైపోయి, వానాకాలంలో షాక్‌లు కొడుతుంటే ఎలా విధులు నిర్వహించాలి?.. వర్షాకాలం వచ్చినప్పుడు ఇలాంటి అసౌకర్యాలెన్నో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు అనుభవిస్తున్నాయి. ఒక్కోసారి అవి దురదృష్టవశాత్తూ కూలిపోయి ఎవరిమీదనో పడినప్పుడు మరణాలు కూడా తప్పడం లేదు. ఇకనైనా ఈ దుస్థితి మారాలి. ప్రభుత్వ శాఖలకి సంబంధించిన కార్యాలయాలు ఎన్ని ఉన్నాయో...ఎలా ఉన్నాయో, వాటిని బాగు చేసేందుకు ఏం చేయాలో ఇంజనీరింగ్, సాంకేతిక, విద్యుత్ సిబ్బందితో కలసిన ప్రత్యేక బృందాలతో వెంటనే నివేదికలు రూపొందించాలి. వాటిని బాగు చేసేందుకు బడ్జెట్‌ను కేటాయించాలి. ముఖ్యంగా పాతబడిన హాస్టళ్ళ భవనాలు, పశువులాసుపత్రులు, గ్రామప్రాంతాల్లో ఏళ్ళ తరబడిగా ఉన్న పంచాయతీ కార్యాలయాలు, ఇతర భవనాలు ఇప్పుడు ఏ దుస్థితిలో ఉన్నాయో గమనించి, వెంటనే వాటి మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. అనేకచోట్ల ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనూ, చాలీచాలని ఇరుకు గదిల్లోనూ అలమటిస్తున్నాయి. వాటిని కూడా పరిశీలించాలి. కొన్ని భవనాలు ఆలనాపాలనా చూసేవారు లేక, పిచ్చిచెట్లు మొలిచి భయంకరంగా దర్శనమిస్తున్నాయి. ప్రహరీగోడలు లేక అనేక కార్యాలయాలు పశువుల కొట్టాలుగా తయారవుతున్నాయి. నీటిపారుదల ప్రాజెక్టులకి సంబంధించి అనేక భవనాలు, కొన్నిచోట్ల తెలుగుగంగ భవనాలు భూతాల కోటలను తలపిస్తున్నాయి. కొత్త భవనాలు ఎన్నయినా కట్టుకోవచ్చు. కానీ, ఉన్న పాతభవనాలను మరమ్మతు చేసుకోకుంటే ప్రజల భద్రత గాలిలో దీపమవుతుంది. ప్రభుత్వ భవనాలు అన్నీ ప్రజాధనంతో నిర్మించినవే కాబట్టి, వాటిని సంరక్షించడం ద్వారా ప్రజాధనాన్ని జాగ్రత్త చేసినట్లవుతుంది. కొన్నిచోట్ల దాతలు ఇచ్చిన భవనాలు కూడా పాడుబడిపోతున్నాయి. జిల్లాస్థాయిల్లో సమగ్ర నివేదికలు తయారుచేసి, రాష్ట్రవ్యాప్తంగా వాటి భద్రతకు చర్యలు తీసుకోవాలి. ఒక భవనం కూలిపోతే ఆ నష్టం ఎలా ఉంటుందో ఊహించలేం. ఎవరైనా పొరపాటున చనిపోతే నష్టపరిహారం ఇవ్వడం కంటే, ఆ భవనం కూలిపోకుండా చూసుకోవడమే ముఖ్యం. శిథిల భవనాలంటే అవి ప్రమాదాలకి ప్రధాన ద్వారాలని అవగాహన చేసుకున్నప్పుడే, ఆ ప్రమాదాలు జరగకుండా ఏంచేయాలోనన్న ఆలోచన పుడుతుంది. ఇలాంటి వ్యవహారాలను దూరదృష్టితో, విజ్ఞతతో ఆలోచించడం పాలకులు చేయాల్సిన పని. పాతబడిన భవనాల్లో ఇటుకలు, చెక్కలు, శ్లాబులు, ఇనుప దూలాలు.. ఎన్నో అవసానదశలో ఉంటాయి. వాటి వెనుక ప్రజల ప్రాణాలు కూడా ఉంటాయని గ్రహించాలి. పర్యవేక్షణ లోపం..ప్రభుత్వ భవనాలకు పెద్ద శాపంగా ఉంటోంది కనుక, శాశ్వత ప్రాతిపదికన ఆ సమస్య నివారణకు తగ్గ ప్రత్యేక అధికార యంత్రాంగాన్ని నియమించాలి. ప్రభుత్వం ఇకనైనా శ్రద్ధ వహించి, కోటానుకోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భవనాలను, ప్రభుత్వ ఆస్తులను చెక్కుచెదరకుండా కాపాడాలి. తద్వారా ప్రజాధనానికి సార్థకత చేకూరేలా వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది!..

# ప్రకృతి హద్దులను గమనించాలి

మనసులో మాట 113

ప్రకృతి పట్ల నిర్లక్ష్యం ఎంతటి వినాశనాన్ని మోసుకొస్తుందో నేపాల్‌లో ఇటీవల సంభవించిన ఆకస్మిక విలయం కళ్లముందుంచింది. కనురెప్పపాటులో ప్రశాంతమైన లోయలు అంధకారంలోకి కూరుకుపోయాయి; కొండల పైనుంచి ఉప్పొంగిన బురద ప్రవాహాలు, ఉధృతమైన వరద నీరు ఊళ్లకు ఊళ్లనే కబళించేశాయి. నిమిషాల వ్యవధిలోనే ఇళ్లు, వంతెనలు, రోడ్లు గాలిలో తేలియాడుతూ నీటిపాలయ్యాయి. అసలు ఏం జరుగుతోందో తేరుకునేలోపే వందలాది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి, ప్రాణభయంతో కేకలు వేస్తూ జనాలు కళ్లముందే కొట్టుకుపోయారు. ఇప్పటివరకు నమోదైన గణాంకాలు కొంతే, ఇంకా మునిగిపోయిన మట్టి దిబ్బల కింద, కొట్టుకుపోయిన శిథిలాల మధ్య ఆచూకీ తెలియని వారు వేల సంఖ్యల్లో ఉన్నారు. ఇక కోలుకోలేని ఈ దెబ్బ నుంచి తేరుకోకముందే, కొండచరియలు అడ్డుపడి ఎగువన కృత్రిమంగా ఏర్పడిన మరొక భారీ సరస్సు ఏ క్షణంలోనైనా తెగిపోవడానికి సిద్ధంగా ఉందనే వార్తలు దిగువ ప్రాంతాల ప్రజలకు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి.

ఈ విపత్తు కేవలం దైవఘటనో, లేదా అనుకోకుండా వచ్చిన ప్రకృతి కోపమో మాత్రమే కాదు; దీని వెనుక లెక్కలేనన్ని మానవ తప్పిదాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా హిందూకుష్-హిమాలయ ప్రాంతంలో పగటి పూట ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతుండటం, గాలిలో తేమను పట్టి ఉంచే సామర్థ్యం మారిపోవడం వల్ల 'మేఘ విస్ఫోటనాలు' తరచూ సంభవిస్తున్నాయి. దీనికి తోడు పర్వతాలపైన ఉన్న హిమానీనదాలు కరిగి నీటిమట్టం పెరగడంవల్ల గ్లేషియల్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్స్ లాంటి భయానక పరిస్థితులు దాపురిస్తున్నాయి. అయితే ప్రకృతి వైపరీత్యానికి మానవుడి విచ్చలవిడి అశాస్త్రీయ అభివృద్ధి తోడవ్వడమే ఈ వినాశనాన్ని మరింత పెంచుతోంది. పర్యావరణ నియమాలను పక్కనబెట్టి కొండలను నిలువునా తవ్వేస్తూ నిర్మిస్తున్న రోడ్లు, నదీ పరివాహక ప్రాంతాలను ఆక్రమించి లేపుతున్న కాంక్రీట్ కట్టడాలు, డ్యామ్‌ల వద్ద పేరుకుపోతున్న లక్షల టన్నుల మట్టి.. నదుల సహజ ప్రవాహ మార్గాలను పూర్తిగా పూడ్చివేశాయి. అదే సమయంలో, సరిహద్దు దేశాల మధ్య దౌత్యపరమైన, సాంకేతిక సమాచార మార్పిడి లోపాలు ఎంతటి ప్రాణనష్టానికి దారితీస్తాయో ఈ విపత్తు నిరూపించింది. ఎగువన ఉన్న టిబెట్/చైనా ప్రాంతంలో ఉద్భవించిన తీవ్ర విపత్తు సంకేతాలను చైనా పరికరాలు, శాటిలైట్లు గుర్తించినప్పటికీ-రెండు దేశాల మధ్య "అధికారిక రియల్-టైమ్ సమాచార మార్పిడి ఒప్పందం" లేదన్న సాంకేతిక కారణంతో చైనా ఆ ముందస్తు సమాచారాన్ని నేపాల్‌తో పంచుకోలేకపోయింది. ఫలితంగా కనీసం 5-10 నిమిషాల ముందస్తు హెచ్చరిక కూడా లేక ప్రజలు సజీవ సమాధి కావాల్సి వచ్చింది. సకాలంలో సమాచారం అందకపోవడం ఎంతటి దారుణానికి దారి తీస్తుందో ఇదొక నిదర్శనం.

ఈ విలయం కేవలం నేపాల్‌కే పరిమితమైన ముప్పు కాదు; భారతదేశానికి కూడా ఇది అత్యంత తీవ్రమైన ముందస్తు హెచ్చరిక. ఎందుకంటే నేపాల్‌లో పుట్టే లేదా ప్రవహించే కోసి, గండక్, ఘాగ్రా(కర్నాలి), మహాకాళి వంటి ప్రధాన నదులు నేరుగా భారతదేశంలోని బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తాయి. నేపాల్‌లో ఏర్పడే ప్రతి విపత్తు నిమిషాల వ్యవధిలోనే సరిహద్దు దాటి భారత్‌లో ప్రళయాన్ని సృష్టించే అవకాశం ఉంది. నేపాల్‌లో అడ్డుపడిన కృత్రిమ సరస్సులు ఏ క్షణంలోనైనా బద్దలైతే, దిగువన ఉన్న బీహార్ ఉత్తర మైదాన ప్రాంతాలు నీటమునిగే ప్రమాదం పొంచి ఉంది. అలాగే, భారత సరిహద్దులోని ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం వంటి పర్వత ప్రాంతాలు కూడా సరిగ్గా నేపాల్ లాంటి పర్యావరణ బలహీనతల్నే కలిగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశం దక్షిణ జాగ్రత్త చర్యలతో పాటు దీర్ఘకాలికంగా పలు కీలకమైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది:

చైనా-నేపాల్ ఒప్పంద లోపాలనుండి పాఠాలు నేర్చుకుని, భారత్-నేపాల్ సరిహద్దు నదులపై ఉమ్మడి ఆటోమేటిక్ హైడ్రోలాజికల్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి. నేపాల్ ఎగువన నీటిమట్టం పెరిగినా, డ్యామ్‌లు తెగిపోయినా క్షణాల్లో బీహార్, యూపీ యంత్రాంగానికి సిగ్నల్ వచ్చేలా సాంకేతిక లింక్‌ను పటిష్టం చేసుకోవాలి.

బీహార్, బెంగాల్, యూపీ రాష్ట్రాల్లోని నదీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలను తక్షణమే తొలగించాలి. వరద ఒత్తిడిని తట్టుకునేలా కోసి, గండక్ కరకట్టలను ఆధునీకరించాలి. మన దేశంలోని ఉత్తరాఖండ్, హిమాచల్, ఈశాన్య రాష్ట్రాల్లో నిర్మాణంలో ఉన్న భారీ డ్యామ్‌లు, సొరంగ మార్గాలు, మరియు పర్వత రహదారులపై వెంటనే "పర్యావరణ ప్రభావ అంచనా" నిర్వహించాలి. కొండల కోతను పూర్తిగా అరికట్టాలి. ఈ భయంకర విపత్తు ఇస్తున్న స్పష్టమైన సందేశం ఒక్కటే: "మానవులు గీసుకున్న రాజకీయ సరిహద్దులను ప్రకృతి అంగీకరించదు." దేశాలు, పాలకులు, ప్రభుత్వాలు మ్యాప్‌లపై గీసే సరిహద్దులు వేరు, నదులు, పర్వతాలు, వాతావరణ వ్యవస్థలతో ప్రకృతి గీసే హద్దులు వేరు. ప్రకృతి గీసిన పర్యావరణ హద్దులను సరిగ్గా అర్థం చేసుకుని, దానికి అనుగుణంగానే మన ప్రాజెక్టులు, మన జీవనశైలి, మన అభివృద్ధి నమూనాలు ఉండాలి. పొరుగు దేశాల మధ్య రాజకీయ సరిహద్దులను తొలగించడం సులభం కాకపోవచ్చు, కానీ ప్రకృతి సృష్టిస్తున్న ఈ ప్రాణముప్పును ఎదుర్కోవడానికి దేశాలు తమ ద్వైపాక్షిక విభేదాలను పక్కనబెట్టి పరస్పర సమన్వయంతో పనిచేయక తప్పదు. ఈ క్రమంలో మొత్తం "నదీ పరివాహక ప్రాంతాన్ని" ఒకే వ్యవస్థగా పరిగణించి ప్లానింగ్ చేయాలి. ఎగువన ఉండే చైనా, మధ్యన ఉండే నేపాల్, దిగువన ఉండే భారతదేశం, బంగ్లాదేశ్‌లు కలిసి ఒక ఉమ్మడి జల-పర్యావరణ విధానాన్ని రూపొందించుకోవాలి. "డిజాస్టర్ డిప్లొమసీ"ని బలోపేతం చేస్తూ, సరిహద్దులకు అతీతంగా, పారదర్శక, చట్టబద్ధమైన సమాచార మార్పిడి వ్యవస్థను నెలకొల్పాలి. రాజకీయ భౌగోళిక సరిహద్దులు మానవ కల్పితాలు, కానీ పర్యావరణ సత్యాలు శాశ్వతమైనవి. సమాచార మార్పిడి లేక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రాకుండా ఇరుగు పొరుగు దేశాలన్నీ విజ్ఞతతో వ్యవహరించి ప్రకృతితో సమన్వయం వహించేలా వ్యవస్థలు ఏర్పాటు చేసుకోకపోతే, ముున్ముందు సంభవించే వైపరీత్యాలు మానవ నాగరికత ఉనికికే ప్రమాదకరంగా మారతాయని నేపాల్ విలయం హెచ్చరిస్తోంది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# తిరుమలలో భక్తుల దుస్థితిని కళ్ళకు కట్టారు!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

తిరుమలలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దర్శనం కోసం వారు పడుతున్న కష్టాలు, క్యూలైన్లలో ఎదురవుతున్న అవస్థలు, అంతరాలయంలో భక్తుల పట్ల సేవకులు వ్యవహరిస్తున్న తీరు, అలాగే పాలకమండలి అధికారులు అవలంబిస్తున్న విధానాలను గత వారం మన 'లాయర్'లో కళ్లకు కట్టినట్టు వివరించారు. ఈ కథనంలో ఉన్న అంశాలన్నీ నూటికి నూరు శాతం నిజాలు. కోట్లాదిమంది భక్తుల మనసులో ఉన్న ఆవేదనకు ఈ వ్యాసం అక్షర రూపం ఇచ్చినట్లుగా ఉంది. తిరుమలకు వచ్చే భక్తుడు ఎలాంటి ప్రత్యేకహోదా, పలుకుబడి లేదా సిఫారసు కోరుకోవడం లేదు. స్వామివారిని ప్రశాంతంగా దర్శించుకుని, మనసారా నమస్కరించుకుని వెళ్లాలని మాత్రమే కోరుకుంటాడు. గంటల తరబడి క్యూలో నిలబడి చివరకు స్వామి వారి సన్నిధికి చేరుకున్నప్పుడు లాగేయడం, తోసేయడం, హడావుడి చేయడం భక్తుడి మనసును ఎంతగా బాధిస్తుందో ఈ కథనం స్పష్టంగా తెలియజేసింది.

భక్తుల నుంచి వస్తున్న ఇలాంటి స్పందనలను కేవలం విమర్శలుగా కాకుండా, తమ పనితీరును సరిదిద్దుకోవడానికి వచ్చిన సూచనలుగా టీటీడీ పాలకమండలి, ఛైర్మెన్, ఈఓ, అధికారులు, సిబ్బంది స్వీకరించాలి. రద్దీని నియంత్రించడం ఎంత అవసరమో, భక్తులను గౌరవంగా, మర్యాదగా చూడటం కూడా అంతే అవసరం. పాలకమండలి నిర్ణయాలు, అధికారుల విధానాలు సామాన్య భక్తుడికి ఇబ్బంది కలిగించకుండా ఉండేలా పునఃసమీక్షించాలి. సేవకులు కూడా భక్తులను కేవలం క్యూలోని సంఖ్యగా కాకుండా, స్వామివారి భక్తులుగా భావించి సేవ చేయాలి. తిరుమల ఒక సాధారణ పర్యాటక కేంద్రం కాదు. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక. అందుకే ఇక్కడ పరిపాలనలో వేగం కంటే మానవత్వం, ఆదాయం కంటే భక్తి సంతృప్తి, సంఖ్య కంటే ప్రశాంతమైన దర్శనానికి ప్రాధాన్యత ఉండాలి. భక్తుడు అంతరాలయం నుంచి బయటకు వచ్చేటప్పుడు 'చాలా కష్టపడ్డాను' అనే బాధతో కాకుండా, 'శ్రీవారిని తృప్తిగా దర్శించుకున్నాను' అనే ఆనందంతో తిరిగివెళ్లే పరిస్థితి కల్పించడమే నిజమైన పరిపాలనా విజయం.

ఇలాంటి ముఖ్యమైన అంశాన్ని ధైర్యంగా, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా ప్రజల ముందుకు తీసుకువచ్చిన 'లాయర్' పత్రికను అభినందిస్తున్నాను.

రాజా శ్రీనివాసులు,
గాంధీబొమ్మ కూడలి, నెల్లూరు.

## తోస్తున్నది నిజమే.. అందుకు కారణం సేవకులు కాదు అధికారులు!


గత వారం మన 'లాయర్'లో తిరుమలపై వచ్చిన వార్తలో "స్వామివారి సేవకులు నిర్దాక్షిణంగా ప్రవర్తిస్తూ భక్తులని తోసేస్తున్నారు" అని రాశారు. నేనుకూడ సేవకి వెళ్లాను. అవును తోసేయడం, లాగేయడం నిజమే. కానీ అందుకు కారణం టీటీడీ అధికారులే. అలా చేయకుంటే సేవకులని అధికారులు కోప్పడుతున్నారు. మీరు చెప్పినట్లు ఈ విధానం మారాలి. అంతరాలయంలో ఆటోమాటిక్ వాక్ లేటర్లు (బెల్టు విధానం) రావాలి. సేవకులు, అధికారుల ప్రమేయం లేకుండానే భక్తులు ముందుకు కదిలిపోయే సాంకేతికతని పరిచయం చేయాలి. క్యూ లైన్‌లలో వత్తిడి, తోపులాట తగ్గాలంటే ఇదొక్కటే మార్గం.

కారుపర్తి లక్ష్మి, చెన్నై.



## తిరుమల వార్తపై అనూహ్య ప్రతిస్పందన

# భక్తమహాశయుల హృదయస్పందన




- తిరుమలపై 'లాయర్' కథనానికి భక్తుల స్పందన
- ఆవేదన, అనుభవం, ప్రశ్నలు, సూచనలు చేసిన భక్తమహాశయులు
- భక్తులకు గౌరవం ఇవ్వటం.. టీటీడీ యొక్క కనీస కర్తవ్యం

**తిరుమలపై గత వారం 'లాయర్' పత్రికలో వెలువడిన "వ్యాపార కేంద్రంగా అవతరిస్తున్న తిరుమల..! ధన్య క్షేత్రాన్ని కాస్తా ధన క్షేత్రంగా మార్చేస్తున్నారా..?" అనే కథనం పాఠకులని విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో అనూహ్యమైన స్పందనను రాబట్టింది. లాయర్ పత్రిక ఫేస్‌బుక్ ఖాతాలో ఈ కథనం దాదాపు 1.71 లక్షల మంది చదివారు. కొన్నివేల మందికిపైగా లైక్ చేశారు. వంద మందికి పైగా పాఠకులు తమ అభిప్రాయాలను కామెంట్ల రూపంలో వ్యక్తం చేశారు.**

ఆ స్పందనకు ముందుగా ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

ఒక పత్రికా కథనానికి ఇంతటి స్పందన రావడం అంటే అది కేవలం ఒక వార్తను చదివినందుకు వచ్చిన స్పందన కాదు. ఆ కథనం తమ అనుభవాన్ని తాకిందని, తమ మనసులోని మాటకు అక్షర రూపం ఇచ్చిందని భావించినప్పుడే పాఠకులు స్పందిస్తారు. తిరుమల విషయంలో వచ్చిన ఈ స్పందనలు కూడా అదే విషయాన్ని చెప్తున్నాయి. టీటీడీ ఎదుర్కొంటున్న రద్దీ, లక్షలాది మంది భక్తులకు దర్శనం కల్పించాల్సిన నిర్వహణా సమస్యలను ప్రస్తావించిన వారూ ఉన్నారు. వారి అభిప్రాయాలను కూడా మేము గౌరవంగా స్వీకరిస్తున్నాం. ఎందుకంటే ప్రశ్నను లేవనెత్తడం ఎంత ముఖ్యమో, భిన్నమైన అభిప్రాయాన్ని వినడం కూడా అంతే ముఖ్యం.

### మేము కూడా అదే అనుభవించాం..!

కామెంట్లలో పదే పదే వినిపించిన మాట..."మేము కూడా అదే అనుభవించాం." ఒక భక్తుడు తన అనుభవాన్ని వివరిస్తూ, రెండు చేతులతో గట్టిగా తోసి వేయడంతో తాను పడిపోబోయానని ఆవేదన వ్యక్తం చేశారు. మరో భక్తుడు ఆగస్టు 19న దర్శనానికి వెళ్లినప్పుడు గట్టిగా లాగి తోశారని, దర్శనం అనంతరం ఆలయం బయటకు రావడానికి కూడా గంట సమయం పట్టిందని పేర్కొన్నారు. మరొకరు ఆగస్టు 20న వీఐపీ బ్రేక్ దర్శనంలో కూడా స్వామివారిని సరిగా చూడనీయలేదని వాపోయారు.

ఇవి చదివినప్పుడు ఒక ప్రశ్న తప్పక తలెత్తుతుంది. భక్తుడిని స్వామివారి దగ్గరకు తీసుకెళ్లి, స్వామివారి ముందు నిలబెట్టి, స్వామివారిని చూడనివ్వకుండా బయటకు పంపితే ఆ దర్శనం ఉద్దేశం ఏమిటి?

### నా మనవరాలితో కలిసి బోర్లా పడ్డాం!

కామెంట్లలో వచ్చిన ఒక అనుభవం అత్యంత కలచివేసింది. ఒక భక్తుడు తన మూడేళ్ల మనవరాలితో కలిసి దర్శనానికి వెళ్లినప్పుడు, స్వామివారి దర్శన గడప వద్ద నుంచి కదలమని చెప్పి, సిబ్బంది తోసేయడంతో తాను, తన చిన్న మనవరాలు ఇద్దరూ కిందపడిపోయామని వివరించారు. ఆ తర్వాత సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయగా మళ్లీ దర్శనం ఏర్పాటు చేశారని కూడా తెలిపారు.

ఇది ఒక వ్యక్తిగత అనుభవం కావచ్చు. కానీ ఇలాంటి అనుభవాలు ఒకటి కాదు, రెండు కాదు అని అనేక కామెంట్లు చెబుతున్నప్పుడు, వాటిని "భక్తుల ఫిర్యాదులు"గా తీసుకుని పరిశీలించడం టీటీడీ కనీస బాధ్యత.

మరో భక్తుడు ఇలా ప్రశ్నించారు:

**"స్వామికి భక్తునికి మధ్య ఒక నిముషమైనా ఏకాంతం ఇవ్వరా?"**

ఆ ఒక్క వాక్యంలోనే మొత్తం సమస్య సారాంశం దాగి ఉంది.

"భక్తులను గౌరవించాలి..."

రవీంద్రనాథ్ చివుకుల చెప్పిన మాటలు చాలా సూటిగా ఉన్నాయి:

"భక్తులకు గౌరవం ఇవ్వటం టీటీడీ యొక్క కనీస కర్తవ్యం."

నిజమే... భక్తుడిని వేగంగా క్యూలో ముందుకు తీసుకెళ్లడం ఒక పరిపాలనా అవసరం కావచ్చు. రద్దీని నియంత్రించడం కూడా అవసరమే. కానీ, వేగం పేరుతో భక్తుడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం మాత్రం సమర్థించలేం. టీటీడీ సిబ్బంది కూడా తమపై ఉన్న ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని మనం అర్థం చేసుకోవాలి. రోజుకు వేలాది, లక్షలాది మంది భక్తులతో వ్యవహరించడం అంత సులభం కాదు. కానీ అదే సమయంలో భక్తుడు కూడా ఒక మనిషే. అతను గంటల తరబడి ప్రయాణించి, క్యూలో నిలబడి, ఎన్నో కష్టాలు పడి చివరకు స్వామివారి ముందుకు వస్తాడు. అతని ఆ క్షణాన్ని గౌరవించడం సేవలో భాగం కావాలి.

### దర్శనం కాదు... దర్శనానికి దారి పెద్ద సమస్య!

కామెంట్లలో మరో ముఖ్యమైన అంశం బయటపడింది. అది క్యూలైన్ నిర్వహణ. ఒక భక్తుడు సర్వదర్శనం క్యూలైన్ అనేక కిలోమీటర్లకు చేరుకుంటోందని, వృద్ధులు నడవలేక సొమ్మసిల్లిపోవడాన్ని చూశానని చెప్పారు. మరో భక్తుడు సర్వదర్శనం కోసం ప్రవేశం ఎక్కడ ఉంటుందో అర్థం కావడం లేదని, తరచూ మారుస్తుండడం, ఒక చోట బస్సు దిగితే క్యూలైన్ ప్రవేశం మరొక చోట ఉండడంతో భక్తులు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి రావడం వంటి సమస్యలను సుదీర్ఘంగా వివరించారు. ఉచిత బస్సులు, బ్యాటరీ వాహనాలతో పాటు క్యూలైన్ వ్యవస్థను కూడా మరింత సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించాడు. ఇవి కేవలం విమర్శలు కాదు. పాలక మండలి పరిశీలించాల్సిన సూచనలు.

### రోజుకు 40 వేల మందికే దర్శనం కల్పించాలి!

కొందరు పాఠకులు మరింత కఠినమైన పరిష్కారాలను సూచించారు. ఒకరు రోజుకు 40వేల మందికే దర్శనం కల్పించాలని, ఆధార్‌తో అనుసంధానం చేసి ఒక వ్యక్తికి సంవత్సరంలో రెండుసార్లు మాత్రమే దర్శనం కల్పించాలని, అన్ని వీఐపీ దర్శనాలను రద్దు చేయాలని సూచించాడు. మరో భక్తుడు కుటుంబానికి సంవత్సరానికి ఒకసారి మాత్రమే దర్శనం కల్పించాలని అభిప్రాయపడ్డాడు. ఇంకొకరు ఆన్‌లైన్ రూ.300 దర్శన టికెట్ల విషయంలో ఆరు నెలలు లేదా సంవత్సరం పాటు మళ్లీ బుక్ చేసుకోకుండా నిబంధన పెట్టాలని సూచించాడు.

ఈ సూచనలు అమలు చేయాలా వద్దా అన్నది వేరే విషయం. కానీ వాటి వెనుక ఉన్న ఆలోచనను మాత్రం టీటీడీ గమనించి గౌరవించాలి.

"ఒక్కసారి వచ్చినవాడికి ఎంత మాత్రపు సంతృప్తికరమైన దర్శనం లభిస్తోంది?" అన్న ప్రశ్నకు టీటీడీ పాలకులు, అధికారులు సమాధానం వెతకాలి.

కొంతమంది తమ కామెంట్లలో టీటీడీని కూడా సమర్థించారు.

ఒక పాఠకుడు, గతంతో పోలిస్తే ఇప్పుడు భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగిందని, ఇంత పెద్ద సంఖ్యలో భక్తులను నిర్వహించడం అంత సులభం కాదని పేర్కొన్నాడు. పరిస్థితిని అర్థం చేసుకోవాలని, కేవలం విమర్శించడం పరిష్కారం కాదని కూడా సూచించాడు. మరో పాఠకుడు కూడా ఏ రోజుకి ఆ రోజు భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నప్పుడు అందరికీ ప్రశాంతమైన దర్శనం కల్పించడం ఎంత కష్టమో ఆలోచించాలని అన్నారు. ఈ అభిప్రాయాలను కూడా 'లాయర్' గౌరవిస్తుంది. టీటీడీపై విమర్శ అంటే టీటీడీ సిబ్బంది చేసే ప్రతి పనినీ తప్పుబట్టడం కాదు. లక్షలాది భక్తులకు ఆహారం, నీరు, వసతి, పారిశుధ్యం, భద్రత, రవాణా వంటి సేవలను అందించడం చిన్న విషయం కాదు. ఆ వ్యవస్థను నిర్వహిస్తున్న సిబ్బంది కష్టాన్ని కూడా గుర్తించాల్సిందే. కానీ, అదే సమయంలో..."రద్దీ ఉంది కాబట్టి భక్తుడిని తోసేయవచ్చా?" అనే ప్రశ్నకు మాత్రం టీటీడీ సమాధానం చెప్పాలి.

### శ్రీవాణి భక్తులూ.. సంతృప్తిగా లేరు!

కథనంలోని ఒక అంశంపై మరో పాఠకుడు ముఖ్యమైన సవరణ చేశారు. శ్రీవాణి భక్తులకు సైతం పూర్తి స్థాయి ప్రోటోకాల్ దర్శనం లభించడం లేదని, మొదటి గడప వరకు దర్శనం మాత్రమే ఉంటుందని, అక్కడ కూడా భక్తులను లాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించడం అవసరం. ఎందుకంటే మా ఉద్దేశం ఏ వర్గాన్నీ మరో వర్గంపై నిలబెట్టడం కాదు. సామాన్య భక్తుడైనా, దాత అయినా, శ్రీవాణి భక్తుడైనా, ఎవరైనా స్వామివారి సన్నిధిలో గౌరవంగా దర్శనం పొందాలి. ఎవరికి ఎక్కువ, ఎవరికి తక్కువ అనే వివాదం కంటే, అందరికీ గౌరవం లభించే వ్యవస్థ ఎలా ఉండాలన్నదే అసలు ప్రశ్న.

### లక్షల రూపాయలు ఇచ్చినా... ఒక్క క్షణమే!

కొంతమంది దాతలు సైతం తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అదే సమయంలో ఒక పాఠకుడు తాను లక్ష రూపాయలు చెల్లించి దర్శనం పొందిన వర్గంలో ఉన్నప్పటికీ, తన చిన్న మనవడితో దర్శనం సమయంలో చాలా ఇబ్బంది పడ్డామని పేర్కొన్నారు.

ఒక్క భక్తుడికి ఎక్కువ సమయం ఇవ్వడం వల్ల వెనుక ఉన్న వేలాదిమందికి ఆలస్యం కావచ్చు. కాబట్టి దర్శన సమయాన్ని పూర్తిగా స్వేచ్ఛగా వదిలేయడం సాధ్యం కాదు. అయితే, అందుకు పరిష్కారం తోసేయడం మాత్రం కాదు. సాంకేతికత, క్యూలైన్ నిర్వహణ, బ్యాచ్‌లుగా ప్రవేశం, స్మార్ట్ మూవింగ్ సిస్టమ్స్, వృద్ధులు, చిన్నపిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు వంటి మార్గాలపై టీటీడీ దృష్టిపెట్టాలి.

### స్వామిని చూడటానికి ఒక రేటు... దగ్గరగా చూడటానికి మరో రేటు!

కామెంట్లలో అత్యంత పదునైన విమర్శలు టికెట్ విధానంపైనా వచ్చాయి. "ఆఖరికి స్వామిని దగ్గర నుంచి చూడాలంటే ఒక రేటు, బాగా దగ్గర నుంచి చూడాలంటే మరో రేటు." ఈ మాట వ్యంగ్యంగా రాసినా, దాని వెనుక ఉన్న సందేహం చాలా తీవ్రమైనది. తిరుమలలో వివిధ దర్శన విధానాలు ఉండటానికి పరిపాలనా కారణాలు ఉండవచ్చు. దాతలు, వృద్ధులు, వికలాంగులు, ప్రోటోకాల్ వ్యక్తులు, ఇతర ప్రత్యేక వర్గాలకు ప్రత్యేక ఏర్పాట్లు అవసరం కావచ్చు. కానీ, ఈ విధానాలన్నింటి మధ్య ఒక విషయం స్పష్టంగా ఉండాలి. డబ్బు చెల్లించే సామర్థ్యం పెరిగిన కొద్దీ దేవుడికి దూరం తగ్గుతుందనే భావన భక్తుల్లో కలగకూడదు.

### రాజకీయ నాయకుల దర్శనాలపైనా ప్రశ్నలు!

కొంతమంది పాఠకులు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులకు లభించే ప్రాధాన్యంపై ప్రశ్నించారు. రాజకీయ నాయకులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖుల కోసం సాధారణ భక్తుల దర్శనాన్ని నిలిపివేయడం సరైనదా? అని ఓ పాఠకుడు ప్రశ్నించారు.

మరో పాఠకుడు రాజకీయ నాయకులకు పదేపదే దర్శనాలు లభిస్తుండగా, సామాన్యులకి, వృద్ధులకు నెలల తరబడి అవకాశం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ఇవి రాజకీయ వ్యాఖ్యలుగా పక్కన పెట్టాల్సిన ప్రశ్నలు కావు. ప్రోటోకాల్ అవసరమైన చోట ఉండాలి. కానీ ప్రోటోకాల్ పేరుతో సామాన్య భక్తుడి దర్శన సమయాన్ని, గౌరవాన్ని తగ్గించకూడదు.

### తిరుమల ధనక్షేత్రంగా ఎప్పుడో మారిపోయింది!

తిరుమల "ధన క్షేత్రంగా మారుతోందన్నది కొత్త విషయం కాదు, ఎప్పుడో మారిపోయింది" అని చాలామంది పాఠకులు తీవ్రంగా వ్యాఖ్యానించారు. మరికొందరు "ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో సామాన్యులకు అవకాశం దొరకడం లేదు" అని చెప్పారు. ఇంకొందరు "జీవితంలో ఒక్కసారే దర్శనం పెట్టాలి" అని సలహా ఇచ్చారు. మరో భక్తుడు "నేను చిన్నప్పుడు సంవత్సరానికి మూడుసార్లు దర్శనం చేసుకునేవాడిని. గత పది సంవత్సరాల్లో కేవలం రెండుసార్లు మాత్రమే దర్శనం చేసుకోగలిగాను" అంటూ తన ఆవేదనను వ్యక్తం చేశారు.

ఈ మాటలు గణాంకాలు కావు. కానీ ఒక భక్తుడి మనసులో మారిన తిరుమల అనుభవానికి ఇవి వ్యక్తిగత సాక్ష్యాలు. అందరూ ఒకే మాట చెప్పలేదు, అదే ఈ చర్చకు బలం. ఈ స్పందనల్లో ఒక విశేషం ఉంది. ఎవరూ ఒకే విధంగా ఆలోచించలేదు. కొంతమంది టీటీడీని తీవ్రంగా విమర్శించారు. మరి కొంతమంది సిబ్బంది వ్యవహారశైలిని తప్పుబట్టారు. ఇంకొంతమంది రాజకీయ జోక్యాన్ని ప్రశ్నించారు. కొంతమంది టికెట్ల విధానాన్ని విమర్శించారు. మరి కొందరు క్యూలైన్ సమస్యను ప్రధానంగా ప్రస్తావించారు. ఇంకొందరు సంవత్సరానికి ఒకసారి లేదా రెండుసార్లు మాత్రమే దర్శనం కల్పించాలని సూచించారు. మరికొందరు టీటీడీ చేస్తున్న సేవలను సమర్థించారు.

ఇదే ప్రజాస్వామ్య చర్చ. ఇదే పత్రికా రచనకు అసలు అర్థం. మా కథనం ఎవరి మీద తీర్పు చెప్పడానికి కాదు. ఒక ప్రశ్నను ప్రజల ముందుంచడానికి మాత్రమే. ఆ ప్రశ్నకు వందల గొంతులు తమ తమ సమాధానాలు ఇచ్చాయి. ఈ స్పందనలు టీటీడీకి ఒక సందేశం. ఈ కామెంట్లన్నింటినీ కలిపి చూస్తే ఒక స్పష్టమైన సందేశం కనిపిస్తోంది. భక్తులు టీటీడీ నుంచి అసాధ్యమైందేది కోరడం లేదు. వాళ్లు కోరేది కేవలం గౌరవం, మర్యాద, సంతృప్తికరమైన దర్శనం, దర్శన విధానాలలో పారదర్శకత,

11లో

## తీరప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత

నెల్లూరు జిల్లాలో సముద్ర తీరప్రాంత భద్రతను మరింత పటిష్టం చేసి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల అధికారులను ఆదేశించారు. ఆగస్టు 31న స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి తీర భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తీరప్రాంతంలో నిరంతర నిఘా, సమర్థవంతమైన పర్యవేక్షణ కొనసాగించాలని, క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని చెప్పారు. మత్స్యకారుల పడవల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియను పటిష్టంగా అమలుచేయడంతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి పడవలు అక్రమంగా జిల్లాలోకి ప్రవేశించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

## 'సర్' గడువు పొడిగింపు

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా(సర్) గడువును మళ్లీ పొడిగించారు. ఆ మేరకు భారత ఎన్నికల సంఘం ఆ షెడ్యూల్‌ను సవరించిందని, క్లెయిమ్‌లు- అభ్యంతరాల దాఖలును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.విజయకుమార్ ఈనెల 1న ఒక ప్రకటనలో తెలిపారు. నోటీసు దశ, క్లెయిమ్‌లు అభ్యంతరాల పరిష్కారం అక్టోబరు 5వ తేదీ వరకు ఉంటుందని, ఆ తర్వాత 9న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారని ఆయన వివరించారు.

## 93 శాతం పింఛన్లు ఇచ్చారు

ప్రతినెలా 1వతేదీనే ప్రభుత్వం పింఛనుదారులకు పింఛన్లు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఆమేరకు అక్టోబర్ 1న జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పింఛనుదారులకు ఆయా ప్రాంతాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. 1వ తేదీన 93 శాతం వరకు పంపిణీ జరిగింది. మొత్తం 2,85,316 మంది పింఛనుదారులకు గాను 2,65,344 మందికి పింఛను నగదును అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు.

## ఉద్యోగ జేఏసీ నిరసన

నెల్లూరులోని ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 1న మూడవ రోజు కూడా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ ఎస్ఇ కార్యాలయం వద్ద జరుగుతున్న ఈ ఆందోళనలో, కారుణ్య నియామకాల పట్ల అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, మినిస్టీరియల్, వర్క్ ఛార్జ్‌డ్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## 1.01 కోట్లతో.. మహాలక్ష్మి ఆలయం



భూమిపూజ చేస్తున్న నారాయణ దంపతులు

నెల్లూరు నవాబుపేటలోని అత్యంత ప్రాచీనమైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆగస్టు 30న రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన సతీమణి రమాదేవితో కలిసి నిర్వహించారు. 2019 లోనే ఆలయ స్థల సేకరణ కోసం 23 అంకణాల స్థలానికి 28లక్షలు అందించామని, ప్రస్తుతం దాతల సాయంతో 1.01 కోట్ల అంచనా వ్యయంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నామని చెప్పారు. మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

## జెన్-జీ యువత ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేస్తా!

- - రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి - -



కోటంరెడ్డికి రాఖీలు కడుతున్న విద్యార్థినులు

జెన్-జీ యువత ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన జెన్‌జీ యువతతో పెద్దఎత్తున సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, అన్నమయ్య సర్కిల్ వద్దనున్న శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్‌లో విద్యార్థిని విద్యార్థులతో ఆత్మీయ భేటీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల ఆకాంక్షలను తెలుసుకున్నారు. దాదాపు 3 గంటల పాటు సాగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జెన్‌జీ యువత అంటే తనకెంతో అభిమానమన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అంటూ, ఈ రెండేళ్ళలో 7 లక్షల ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. యువత భవిష్యత్తు కోసం యువనేత నారా లోకేష్ నిరంతరం కృషిచేస్తూ వారికి బంగారు బాట వేస్తున్నారన్నారు. తనకు నిత్యం ప్రజల్లో ఉండడమే ఇష్టమని, ఎల్లప్పుడూ తాను ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు.

**భారత్ తప్పకుండా 'విశ్వగురువు' అవుతుంది**

'భారత్ అభివృద్ధి చెందిన దేశం' అని, ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా తయారై త్వరలోనే భారత విశ్వగురువు అవుతుందని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఉద్వేగంతో అన్నారు. జన్‌జీ యువత తప్పకుండా ఈ మార్పును చూస్తుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## జనసైనికుల బైక్ ర్యాలీ



యువత కలలను సాకారం చేస్తూ, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా నెల్లూరులో ఈనెల 2న జనసేన పార్టీ నాయకులు కిషోర్ గునుకుల, ఆయన సతీమణి విజయలక్ష్మి, నాయకులు ప్రశాంత్ గౌడ్, హేమచంద్ర యాదవ్, నాగేంద్రబాబు, కృష్ణమోహన్‌రెడ్డి, మల్లిరెడ్డి, షాజహాన్ తదితర నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత, చిల్డ్రన్స్ పార్క్ ఎదురుగా ఉన్న వినాయక స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో జనసేనాని పవన్ కళ్యాణ్‌కి దీర్ఘాయుష్షు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# నెల్లూరు కబుర్లు

## రైతుల సమస్యపై.. ఆనం చొరవ



రైతులతో సమస్యలపై చర్చిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

కావలి కాలువ పరిధిలోని రైతాంగ సమస్యలపై రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. ఇటీవల నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పలువురు రైతులు, రైతు నాయకులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి కావలి కాలువ రైతాంగానికి ఎదురవుతున్న సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించగా, వారి సమస్యలు విన్న మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల, విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌తో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతాంగ అవసరాలకు ఎలాంటి అవరోధం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు.

## వేమిరెడ్డికి.. మహిళానేతల రాఖీలు



విపిఆర్‌కి రాఖీలు కడుతున్న తెలుగుదేశం మహిళా నేతలు

రాఖీ పూర్ణిమ సందర్భంగా పలువురు మహిళా నాయకులు ఆగస్టు 28న నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను కలిసి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా నాయకురాళ్ళు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి రాఖీ కట్టి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్ పర్సన్ పఠాన్ నస్రీన్, కోవూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు షేక్ పర్వీన్, కౌన్సిలర్‌లు వైష్ణవి, ప్రత్యూష, లక్ష్మీ కాంతమ్మ, లలితరెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడి గుండెల్లో.. వైఎస్ఆర్

● వర్ధంతి సభలో పర్వతరెడ్డి



వైయస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైకాపా నాయకులు

వైయస్ రాజశేఖర్‌రెడ్డి మరువలేని మహానేత అని, మనకు దూరమై.. 17 ఏళ్ళు అయినప్పటికీ.. ఆయన ప్రతి పేదవాడి గుండెల్లో.. చిరస్థాయిగా నిలిచి ఉన్నారని వైసీపీ నేత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 2న వైఎస్ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని గాంధీబొమ్మకూడలి వద్దనున్న వైఎస్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్ ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవలను ఆయన గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్,ఉచిత విద్యుత్, జలయజ్ఞం పథకాలతో.. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన మహనీయుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఆ మహానేత ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే దిశగా, వారి తనయుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబోయ్!..ఎండలు

ఎండలు మండిపోతూనే ఉన్నాయి. సెగ గాలులతో ఉక్కపోతతో జనం అవస్థలు పడుతున్నారు. ఈనెల 1న అత్యధికంగా కావలిలో 39.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లావ్యాప్తంగా వేడి వాతావరణం అలముకుంది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉంటోంది. సాయంత్రమైనా ఉక్కపోత తగ్గడం లేదు. దీంతో ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకాశంలో నల్లమబ్బులు చూసి రేపో మాపో వానలు కురుస్తాయని ప్రజలు అనుకుంటున్నారు కానీ, ఇప్పటిదాకా చినుకుల జాడ లేదు.

## గంజాయి స్వాధీనం

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మనోరంజన్ నాయక్‌ని రైల్వేపోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకుని, ఆయన బ్యాగ్‌లో ఉన్న 4.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాయగఢ్‌లో గంజాయిని కొనుగోలు చేశానని, చెన్నైలో విక్రయించేందుకు తీసుకువెళ్తున్నానని నిందితుడు విచారణలో చెప్పినట్లు నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ ఈనెల 1న విలేకర్ల సమావేశంలో తెలిపారు. రైల్వే సీఐ సుధాకర్ పర్యవేక్షణలో నెల్లూరు-గూడూరు రైల్వే ఎస్ఐలు హరిచందన, ఎం.నారాయణ, తమ సిబ్బందితో తనిఖీలు చేస్తున్న క్రమంలో గంజాయి నిందితుడిని పట్టుకున్నారన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రెండు లక్షల రూపాయల దాకా ఉంటుందన్నారు. నిందితుని అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ-ఎస్ఐలను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## డీవైఎఫ్ఐ.. రాష్ట్ర మహాసభలు

డీవైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభలు నెల్లూరులో ఈనెల 1న ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీఆర్‌సి నుంచి నర్తకి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో డీవైఎఫ్ఐ అఖిలభారత ఉపాధ్యక్షుడు జాక్ సీ థామస్ మాట్లాడుతూ, దేశంలో నిరుద్యోగులు, రైతులు పడుతున్న ఇబ్బందులను మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. నెల్లూరులో గంజాయికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న పెంచలయ్యని గంజాయి ముఠా హత్య చేయడం దారుణమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి డీవైఎఫ్ఐ ఎల్లప్పుడూ పోరాడుతుందన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాము, జి.రామన్న, జిల్లా నాయకులు నరసింహ, రమణ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## మానవ్ రోహిత — కల్యాణ వైభవం...!



నెల్లూరు నగర మాజీ శాసనసభ్యులు, విలువలున్న రాజకీయ నేత జేకే రెడ్డి - స్వర్గీయ సులోచనమ్మల మనుమడు, కీ.శే. జక్కా రామమోహన్‌రెడ్డి - శ్రీమతి విజితల కుమారుడు జక్కా మానవ్ - రోహితల పెళ్ళి ఆగస్టు 27వతేదీ హైదరాబాదులో జరిగింది. కొత్త దంపతులకి లాయర్ శుభ దీవెనలు.



## చంద్రబాబుకి రాఖీ కట్టిన ప్రశాంతమ్మ

రాఖీ పండుగ సందర్భంగా ఆగస్టు 30న కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి రాఖీ కట్టి, రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణని కూడా కలిసి ప్రశాంతిరెడ్డి రాఖీ కట్టారు.

# వచ్చే ఏడాదికల్లా.. ఆత్మకూరుకు కొత్త రూపు!

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి



ఆత్మకూరు బైపాస్ రోడ్డు పనులని పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

వచ్చే ఏడాది మార్చి నాటికి ఆత్మకూరుకు కొత్త రూపు తీసుకువస్తామని, సుమారు రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు అభివృద్ధిపనులకు ఖర్చు చేసి ఆత్మకూరు పట్టణ సమగ్ర అభివృద్ధిని సాకారం చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి చెప్పారు. ఆగస్టు 31న ఆత్మకూరు బైపాస్ రోడ్డు పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు 12 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఆత్మకూరు శాసనసభ్యుడిగా పనిచేసిన సమయంలో ఆత్మకూరు నెల్లూరుపాలెం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు నాలుగు లైన్ల రహదారిని నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ రహదారి మరమ్మతులకు రూ.40 లక్షలు విడుదల చేసి పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే ఆత్మకూరు నుంచి సోమశిల వరకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరగా, ఆయన రూ.5 కోట్లు మంజూరు చేశారని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సంఘం-కలిగిరి-హసనాపురం మార్గంలో మధ్యలో 5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు బైపాస్ రోడ్డు ప్రారంభోత్సవం, అభయాంజనేయ స్వామి ఆలయ భవనానికి శంకుస్థాపన, టిడ్కో కాలనీలో నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలను త్వరలోనే నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేస్తామన్నారు. వాసిలి-వెంకటరావుపల్లి, నాగులపాడు రహదారులు కూడా మంజూరయ్యాయని వెల్లడించారు.

### 20 ఎకరాల విస్తీర్ణంలో స్టేడియం

ఆత్మకూరు పట్టణంలో సుమారు 20 ఎకరాల్లో స్టేడియం నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఈ స్టేడియం గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఐటీడీఏ శిక్షణ కళాశాలకు మార్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్త భవనాలు నిర్మించి బీసీ గురుకుల పాఠశాల తరగతులను ఆ భవనాల్లో నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఇందుకు సుమారు ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

## మారుమూల గ్రామాలకు..

# 4జీ-5జీ వెలుగులు!

- జనార్ధనపురంలో మొబైల్ టవర్‌కు శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు ఫరూఖ్, సుభాష్, ఎమ్మెల్యే సురేష్



జిల్లాలోని మారుమూల గ్రామాలు సైతం ఇక 4జీ-5జీ వెలుగులతో ప్రకాశమానం కానున్నాయి. ఇటీవల నెల్లూరు జిల్లా వింజమూరు మండలం జనార్ధనపురం గ్రామపంచాయతీలో అత్యాధునిక బీఎస్ఎన్ఎల్ 4జీ-5జీ మొబైల్ టవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగింది. దాదాపు కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బీఎస్ఎన్ఎల్ అత్యాధునిక 4జీ-5జీ మొబైల్ టవర్ నిర్మాణ పనులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్.ఎం.డి.ఫరూఖ్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ... కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో, ఉదయగిరి నియోజకవర్గ టెలికాం అడ్వైజరీ డైరెక్టర్ తాటికొండ అనూష కృషి ఫలితంగా ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం రూ.34 కోట్ల వ్యయంతో 34 మొబైల్ టవర్ల నిర్మాణానికి అనుమతులు పొందడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటికే 21 టవర్లకు పూర్తిస్థాయి అనుమతులు లభించగా, వాటి నిర్మాణ ప్రక్రియ వేగవంతం కానుందని తెలిపారు. మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచల్‌బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25లోగా.. పొట్టేపాళెం బ్రిడ్జి

ఈనెల 20వ తేదీ నుండి 25 తేదీలోగా పొట్టేపాలెం కలుజు మీద బ్రిడ్జిని ప్రారంభిస్తామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పొట్టేపాలెం కలుజు మీద బ్రిడ్జి పనులను ఆయన ఇటీవల సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ, పొట్టేపాలెం కలుజు బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

# దీపమ్మ సేవలు.. అభినందనీయం!

**- కొనియాడిన ఎమ్మెల్యే సోమిరెడ్డి**



విజేత జట్టుకి ట్రోఫీని బహుకరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

'మా పెద్దాయన..భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆశీస్సులతో, ఆయన కుమార్తె దీపమ్మ ఆధ్వర్యంలో వెంకటాచలంలో అక్షర స్కూలు అద్భుతంగా నిర్వహించబడుతోందని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా దీపమ్మ ఎంతోమంది పిల్లలకు ఉచితంగా అన్ని వసతులు ఇచ్చి చదివించడం మరెంతో అభినందనీయమన్నారు. పేదలకి వెలుగునిచ్చేందుకు దీపమ్మ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా విద్యార్థులకి వివరించారు. వెంకటాచలంలోని అక్షర స్కూల్‌లో సీబీఎస్ఇ క్లస్టర్ 7వ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, అక్షర స్కూలు వేదికగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన సీబీఎస్ఈ స్కూలు బాలికల బాస్కెట్‌బాల్ టోర్నమెంటు విజయవంతంగా జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 120 జట్ల విద్యార్థినులు క్రీడాస్ఫూర్తితో రాణించారని ఆయన ప్రశంసించారు. పిల్లలకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమేనని, తల్లితండ్రులు తమ పిల్లలను క్రీడల్లో కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అయితే, చాలా స్కూళ్ళలో పిల్లలు ఆడుకునేందుకు మైదానాలు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ స్కూళ్లలోనూ కొన్నింటిలో మైదానాలు లేకపోగా కార్పొరేట్ స్కూళ్లు అపార్టుమెంట్లలోకి మారిపోతున్నాయన్నారు. చిన్నారులకు వ్యాయామం, శారీరక శ్రమ లేకపోవడం షుగర్‌తో పాటు స్థూలకాయం సమస్యల బారిన పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలను జంక్ ఫుడ్‌తో పాటు డిజిటల్ స్క్రీన్లకు పిల్లలను దూరంగా ఉంచాలని ఆయన ఈ సందర్భంగా తల్లితండ్రులకు సూచించారు.




# యువ విద్యార్థి పరిచయ వలయం : అవకాశాలను తెరిచే నెట్‌వర్కింగ్ మార్గం!

యువ విద్యార్థి జీవితంలో పరిచయ వలయం అనేది కేవలం వ్యక్తిగత సంబంధాల సమాహారం కాదు; అది భవిష్యత్తు అవకాశాలకు తలుపులు తెరిచే ఒక శక్తివంతమైన సామాజిక మూలధనం. విద్యార్థి దశలో ఏర్పడే పరిచయాలు, స్నేహాలు, మార్గదర్శకులు, ఉపాధ్యాయులు, సహచరులు, మరియు వృత్తి ప్రపంచంతో ఏర్పడే తొలి సంబంధాలు ..ఇవన్నీ కలిసి ఒకవ్యక్తి భవిష్యత్తును నిర్మించే పునాది అవుతాయి. ఈ వయస్సులో మనం కలిసే ప్రతివ్యక్తి, మాట్లాడే ప్రతి మాట, అడిగే ప్రతి ప్రశ్న, పాల్గొనే ప్రతి కార్యక్రమం..ఇవన్నీ మన పరిచయ వలయాన్ని విస్తరించే అవకాశాలు. అందుకే ఒక ప్రముఖ విద్యావేత్త చెప్పినట్లుగా, 'విద్యార్థి జీవితంలో పరిచయాలు పుస్తకాలంత ముఖ్యమైనవి; పుస్తకాలు జ్ఞానం ఇస్తాయి, పరిచయాలు దిశ చూపుతాయి'.. నేటి ప్రపంచీకరణ యుగంలో, పరిచయ వలయం ఒక విద్యార్థి వ్యక్తిత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, వృత్తి అవకాశాలను, మరియు సామాజిక ప్రభావాన్ని పెంచే అత్యంత ముఖ్యమైన సాధనంగా మారింది.

యువ విద్యార్థి నెట్‌వర్కింగ్ అంటే కేవలం కొత్త వ్యక్తులను కలవడం కాదు; అది ఒక ఆలోచనా విధానం, ఒక జీవనశైలి, ఒక సామాజిక నైపుణ్యం. నెట్‌వర్కింగ్ అనేది 'సంబంధాలను నిర్మించడం' అనే భావనతో ప్రారంభమై, 'సంబంధాలను నిలబెట్టడం' అనే బాధ్యతతో కొనసాగుతుంది. విద్యార్థి దశలో ఏర్పడే పరిచయాలు, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు, పరిశోధన అవకాశాలు, మార్గదర్శకత్వం, మరియు వ్యక్తిగత అభివృద్ధికి దారితీస్తాయి. ఒక విద్యార్థి తన పరిచయ వలయాన్ని విస్తరించడానికి ముందుగా తన వ్యక్తిత్వాన్ని, తన లక్ష్యాలను, తన ఆసక్తులను స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే నెట్‌వర్కింగ్ అనేది వ్యక్తిత్వం మరియు సంబంధాల మధ్య ఉన్న ఒక సున్నితమైన సమతుల్యత. మనం ఎవరో, మనం ఏం కోరుకుంటున్నామో, మనం ఏ దిశలో ప్రయాణిస్తున్నామో..ఇవన్నీ మన పరిచయ వలయాన్ని ప్రభావితం చేస్తాయి. విద్యార్థి దశలో నెట్‌వర్కింగ్ ప్రారంభమయ్యే మొదటి వేదిక.. పాఠశాల. తరగతి గదిలో మనతోపాటు కూర్చున్న సహచరులు, మనకు బోధించే ఉపాధ్యాయులు, మనకు మార్గదర్శకత్వం ఇచ్చే మెంటర్లు.. వీరందరూ మన పరిచయ వలయంలో కీలకపాత్ర పోషిస్తారు. ఉపాధ్యాయులతో మాట్లాడటం, సందేహాలు అడగటం, తరగతి బయట కూడా వారి మార్గదర్శకత్వం పొందటం.. ఇవన్నీ విద్యార్థి నెట్‌వర్కింగ్‌కు పునాది. ఉపాధ్యాయులు కేవలం పాఠాలుచెప్పే వ్యక్తులు కాదు; వారు మన భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు. ఒక మంచి ఉపాధ్యాయుడు, ఒక మంచి మార్గదర్శకుడు.. విద్యార్థి జీవితంలో ఒక వెలుగుదారి. అందుకే ఒక విద్యావేత్త చెప్పినమాట ఎంతో ప్రాసంగికం: "ఉపాధ్యాయుడు ఒకవ్యక్తి కాదు; ఒక దిశ".. ఈ దిశను సరిగ్గా అనుసరించిన విద్యార్థి, తన పరిచయ వలయాన్ని సహజంగా విస్తరించగలడు.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

పాఠశాల తర్వాత నెట్‌వర్కింగ్ విస్తరించే రెండవ వేదిక..కళాశాల. కళాశాల జీవితం అనేది వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక పరిచయాలకు, వృత్తి అవకాశాలకు ఒక విశాలమైన వేదిక. ఇక్కడ మనం కలిసే వ్యక్తులు, పాల్గొనే కార్యక్రమాలు, చేరే క్లబ్బులు, చేసే ప్రాజెక్టులు.. ఇవన్నీ మన పరిచయ వలయాన్ని మరింత విస్తరించే అవకాశాలు. కళాశాలలో నెట్‌వర్కింగ్ అంటే కేవలం స్నేహాలు చేయడం కాదు; అది ఒక సామాజిక నైపుణ్యం. మనం మాట్లాడే తీరు, మనం వినే తీరు, మనం ప్రశ్నలు అడిగే తీరు..ఇవన్నీ మన పరిచయాలను ప్రభావితం చేస్తాయి. ఒక విద్యార్థి తన పరిచయ వలయాన్ని విస్తరించాలంటే, ముందుగా తన ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. ఎందుకంటే నెట్‌వర్కింగ్ అనేది ధైర్యం మరియు వినయం కలిసిన ఒక కళ. ధైర్యం లేకపోతే మనం కొత్త వ్యక్తులను కలవలేం; వినయం లేకపోతే మనం సంబంధాలను నిలబెట్టలేం.నేటి డిజిటల్ యుగంలో నెట్‌వర్కింగ్‌కు మరో శక్తివంతమైన వేదిక.. ఆన్‌లైన్ ప్రపంచం. సోషల్‌మీడియా, విద్యా వేదికలు, వృత్తి సంబంధిత వేదికలు, ఆన్‌లైన్ కోర్సులు ఇవన్నీ విద్యార్థికి ప్రపంచవ్యాప్తంగా పరిచయాలను ఏర్పరచే అవకాశాలు. ఒక విద్యార్థి తన ఆసక్తులకు సంబంధించిన ఆన్‌లైన్ గ్రూపుల్లో పాల్గొనటం, చర్చల్లో భాగం కావటం, ప్రశ్నలు అడగటం, తన అభిప్రాయాలను పంచుకోవటం..ఇవన్నీ నెట్‌వర్కింగ్‌కు కొత్తమార్గాలు. డిజిటల్ నెట్ వర్కింగ్‌లో ఒక ముఖ్యమైన అంశం..మన ఆన్‌లైన్ వ్యక్తిత్వం. మనం ఎలా రాస్తామో, ఎలా స్పందిస్తామో, ఎలా చర్చిస్తామో..ఇవన్నీ మన పరిచయ వలయాన్ని ప్రభావితం చేస్తాయి. నెట్‌వర్కింగ్‌లో మరో ముఖ్యమైన అంశం..పరస్పర సహకారం. నెట్‌వర్కింగ్ అనేది కేవలం మనకు ఉపయోగపడే సంబంధాలను నిర్మించడం కాదు; అది ఇతరులకు ఉపయోగపడే సంబంధాలను కూడా నిర్మించడం. మనం ఇతరులకు సహాయం చేస్తే, ఇతరులు మనకు సహాయం చేస్తారు. ఇది ఒక సహజమైన సామాజిక చక్రం. నెట్‌వర్కింగ్‌లో చివరి కానీ అత్యంత ముఖ్యమైన అంశం..సంబంధాలను నిలబెట్టడం. కొత్తవ్యక్తులను కలవడం సులభం; కానీ సంబంధాలను నిలబెట్టడం ఒక కళ. మనం కలిసిన వ్యక్తులతో అప్పుడప్పుడు మాట్లాడటం, వారి విజయాలను అభినందించడం, వారి ప్రయాణాన్ని గౌరవించడం..ఇవన్నీ సంబంధాలను బలపరుస్తాయి. నెట్‌వర్కింగ్ అనేది ఒకసారి జరిగే చర్య కాదు; అది నిరంతర ప్రక్రియ. ఒక విద్యార్థి తన పరిచయ వలయాన్ని బలపరచాలంటే, సంబంధాలను నిలబెట్టే నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి. ఎందుకంటే సంబంధాలు నిలబడితే అవకాశాలు నిలబడతాయి..అవకాశాలు నిలబడితే భవిష్యత్తు నిలబడుతుంది. ముగింపులో, యువ విద్యార్థి పరిచయ వలయం అనేది ఒక వ్యక్తి భవిష్యత్తును నిర్మించే శక్తివంతమైన సాధనం. నెట్‌వర్కింగ్ అనేది ఒక నైపుణ్యం, ఒక కళ, ఒక దిశ. ఈ దిశను సరిగ్గా అనుసరించిన విద్యార్థి, తన జీవితంలో అనేక అవకాశాలను తెరవగలడు. అందుకే యువ విద్యార్థి నెట్‌వర్కింగ్‌ను ఒక బాధ్యతగా, ఒక అవకాశంగా, ఒక శక్తిగా చూడాలి.



**వచ్చే వారం :** మాటలతో మారే జీవితం: యువతకు అవసరమైన సంభాషణ నైపుణ్యాలు!

E-mail: reddyu@gmail.com

# ఎంఎస్ఎంఇలను పటిష్టం చేయాలి

## రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు

భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఎంఎస్ఎంఇలు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత పోటీతత్వంతో ఎదిగేందుకు ఆర్థిక, సాంకేతిక, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్ కోరారు. 2025-26లో దేశ మొత్తం ఎగుమతుల్లో ఎంఎస్ఎంఈలకు సంబంధించిన ఉత్పత్తుల వాటా 50.60 శాతానికి చేరిందని, దేశవ్యాప్తంగా 9.29 కోట్లకు పైగా ఎంఎస్ఎంఈలు నమోదయ్యాయని పార్లమెంటరీ కమిటీ నివేదిక పేర్కొందని, అయితే, విదేశీ మార్కెట్లపై సమాచారం, ఎగుమతి ఫైనాన్స్, లాజిస్టిక్స్, డాక్యుమెంటేషన్, అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలు, సర్టిఫికేషన్ వంటి అంశాలు చిన్న సంస్థలకు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని కమిటీ గుర్తించిందని ఆయన తెలిపారు. ఎగుమతుల కేంద్రాలు, ఇతరత్రా పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ముఖ్యంగా గ్రామీణ, చిన్న మరియు మొదటిసారి ఎగుమతులు చేసే సంస్థలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు.

# 'సౌందర్యలహరి' శ్లోక పారాయణం



నెల్లూరు పొగతోట గాంధీనగర్‌లో ఉన్న ఆదిశంకర ధ్యాన మందిరంలో విగ్రహ ప్రతిష్టాపన వార్షికోత్సవ సందర్భంగా మందిర ప్రాంగణంలో ముదివర్తి లక్ష్మీకామాక్షి మహిళా మండలి సభ్యులు దాదాపు 15 మంది శ్రీ శంకర భగవత్పాదులు వారు రచించిన 'సౌందర్య లహరి' 100శ్లోకాలను భక్తిశ్రద్ధలతో గానం చేశారు. మందిర కమిటీ అధ్యక్షుడు గుండా పంతుల రామసుబ్రహ్మణ్యశర్మ నేర్పించిన రుద్ర సూక్తం, పురుష సూక్తం, శ్రీ సూక్తం శ్లోక రూపంలో గానం చేశారు. ఈ కార్యక్రమం జరుగుతున్నంత సేపు ధర్మాధికారి లక్ష్మీనరసింహం స్వామివార్లకు పుష్పార్చనలు చేశారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో చక్రాల వెంకటసుబ్బమ్మ, భువనగిరి లక్ష్మీ శైలజ. చక్రాల నాగరత్నకుమారి, ఉమామహేశ్వరి, చక్రాల వెంకట నరసయ్య, పంచాగ్నుల కళాధర్, పీవీ ప్రసాద్ గన్నవరం ప్రభాకర్ శర్మ, కుమార్, శ్రీహరి, ఒంగోలు సుధాకర్, టీవీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కామాక్షితాయి అమ్మవారికి..

# లక్ష కుంకుమార్చన

మూడవ శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని జొన్నవాడ దేవాలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు పర్యవేక్షించారు.

## సీనియర్ ఉపాధ్యాయునికి..

# ఎమ్మెల్యే సన్మానం!



శ్రీనివాసరావుని సత్కరిస్తున్న కాకర్ల

గత 40 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా సేవలందిస్తూ ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన తొట్టెంపూడి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఇటీవల వింజమూరులో నిర్వహించిన సభలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన నాలుగు దశాబ్దాల పాటు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన శ్రీనివాసరావు సేవలను ఆయన కొనియాడారు.

# అన్నమయ్య సంకీర్తనలు అజరామరం!



- వెంకట్ గరికపాటి

అచంచల భక్తితత్వంతో శ్రీ వేంకటేశ్వరునిపై వేలాది సంకీర్తనలను వెలయించిన వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యులు అని, ఆయన సంకీర్తనలు అజరామరమని ప్రముఖ సాహితీవేత్త.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత జనరల్ మేనేజర్ వెంకట్ గరికపాటి పేర్కొన్నారు. చేతనసంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నగరంలోని వర్ధమాన సమాజం రీడింగ్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, 'అన్నమయ్య సంకీర్తనలు..అచ్చ తెలుగు పలుకులు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రజల భాషకు సాహిత్య గౌరవం కలిగించిన వాగ్గేయ శిరోమణి అన్నమయ్య అని కీర్తించారు. అనంతరం వెంకట్ గరికపాటిని సన్మానించారు. చేతన కార్యదర్శి వై. శేషగిరీశం, వీఆర్‌సీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణపట్నంలోని ఇమామీ అగ్రోటెక్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.నారాయణమూర్తి, ఎస్‌బీఐ నెల్లూరు రీజినల్ మేనేజర్ మురళీనాయక్, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడు, సాహితీవేత్తలు గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణ, గోవిందరాజుల సుభద్రాదేవి, చేజర్ల వినయ తదితరులు పాల్గొన్నారు.

# ఆలోచనాత్మక నవల..'జీవితం ఒక సముద్రం'



'జీవితం ఒక సముద్రం' నవలని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

నెల్లూరుకు చెందిన ప్రముఖ కథ-నవలా రచయిత పొట్లూరు సుబ్రహ్మణ్యం రచించిన 'జీవితం ఒక సముద్రం' నవలను ఇటీవల విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ప్రేమతో పాటు తమ భవిష్యత్తు, ఆర్థిక స్థిరత్వం, కుటుంబ బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రచయిత పొట్లూరు మాట్లాడుతూ, ప్రేమించడం తప్పు కాదని, అయితే ఆర్థిక స్థిరత్వం లేకుండా ప్రేమికులు వివాహం చేసుకుంటే జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. యువత భవితను ఆకాంక్షిస్తూ, వారికి ఉపయోగకరమైన సామాజిక అంశాలను తెలియజేస్తూ నవలను రచించడం పట్ల రచయితను వక్తలందరూ అభినందించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ. కె.సునీత, తెలుగు విభాగం అధిపతి డాక్టర్ నీల మణికంఠ, గోవిందరాజు సుభద్రాదేవి, బొగ్గరపు రాధాకృష్ణ, ఇసనాక దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

## ఎమ్మెల్యే సోమిరెడ్డి




లబ్దిదారులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

మత్స్యకారుల ప్రయోజనాల విషయంలో రాజీపడేది ఉండదని, ఎల్లప్పుడూ వారికి తాము అండగా ఉంటామని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల ఆయన టీడీపీ జిల్లా అధ్యక్షుడు.. ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలసి నెల్లూరులోని మత్స్య శాఖ కార్యాలయంలో జరిగిన మత్స్యకార సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి మెజార్టీ మత్స్యకారులు తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తున్నారని ఆయన గుర్తుచేశారు. దశాబ్దాలుగా తమకు వారితో ఉన్న అనుబంధంతో మత్స్యకారులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు చేసింది శూన్యమని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్యకారుల సంక్షేమం కోసం అంకితభావంతో కృషి చేస్తోందని, వేట విరామ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచడంతో పాటు ఎక్కువ శాతం మందికి దాని ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టిందని, రూ.1.20 కోట్ల విలువైన డీప్ సీ బోటు కొనుగోలుకు మత్స్యకారులకు 40 శాతం మాత్రం సబ్సిడీ ఉందని తెలిపారు. సీఎస్ఆర్ నిధులు కేటాయించి సబ్సిడీని 60 శాతానికి పెంచాలని కలెక్టర్‌తోనూ సంప్రదించామని ఆయన చెప్పారు. మన మత్స్యకారులు ఆ బోట్లు తీసుకుంటే తమిళనాడు, కారైకల్ వారితో పోటీపడి వేట సాగించవచ్చన్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లే బోటును ట్రాక్ చేసే పరికరాలను కూడా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. సబ్సిడీపై కూడా మత్స్యకారులకు అనేక రకాల సౌకర్యాలు కల్పిస్తోందని ఆయన తెలిపారు. మత్స్యకారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రక్షా బంధన్ పర్వదినం సందర్భంగా సోమిరెడ్డి, బీద రవిచంద్రలకు మత్స్యకార మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో..

# జాతీయ క్రీడా దినోత్సవం

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భారతదేశ హాకీ దిగ్గజ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29న కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతదేశానికి హాకీ క్రీడలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, గౌరవం తీసుకువచ్చిన మహోన్నత క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. ఆయన ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం, క్రీడాస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమన్నారు. ఫిజికల్ డైరెక్టర్ డా. వి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవనశైలికి క్రీడలు మరియు శారీరక వ్యాయామం ఎంతో అవసరమని విద్యార్థులకి వివరించారు. అనంతరం, జాతీయ క్రీడా దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రిన్సిపాల్ డా. ఎం. శ్రీనివాసులు మెమెంటోలు అందజేసి అభినందించారు.

# భరతనాట్యంలో.. యామిని ప్రపంచ రికార్డు



యామినిని అభినందిస్తున్న ఎన్‌బీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.శ్రీనివాసులు తదితరులు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థిని పిండి యామిని భరతనాట్యంలో తన అద్భుత ప్రతిభతో అందరి అభినందనలు అందుకుంది. ఇటీవల శ్రీరంగం, తిరుచ్చిలో నిర్వహించిన 'నవరస నాట్య–2026' కార్యక్రమంలో పాల్గొని అంతర్జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన 'నృత్య ప్రతిభ అవార్డు'ను అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఎన్‌బీకెఆర్ కరస్పాండెంట్ ఎన్.రామ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు, సబ్ లెఫ్టినెంట్ డా. వి.మల్లికార్జునరెడ్డి , డా.టి.సుజిలతా తదితరులు యామినిని అభినందించారు. ఆమె సాధించిన ఈ విజయాన్ని ప్రశంసిస్తూ, ప్రపంచ రికార్డు సాధించి, మంచి గుర్తింపు పొందినందుకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ శాస్త్రీయ నృత్యంపై ఆమెకు ఉన్న అంకితభావాన్ని మెచ్చుకుంటూ, భవిష్యత్తులో యామిని మరెన్నో విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.



జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 2వ తేదీన గూడూరు జనసేన నాయకులు ఏటేటి చంద్రనీల్, షేక్ నయీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం శిబిరంలో రక్తదానం చేస్తున్న జనసైనికులు.

# గూడూరు డివిజన్

# సమస్యలు పరిష్కరించేలా చర్యలు

## ఎమ్మెల్యే పాశం సునీల్



ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఇటీవల పట్టణంలోని ఆయన నివాసానికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజాసంక్షేమానికే మొదటి ప్రాధాన్యమని, మీ సమస్యలు తప్పక తీరుస్తామని అన్నారు.

# 'సర్'పై అధికారులతో సమీక్ష

గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ రేఖరాణి సర్ అంశంపై అధి కారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవోతో పాటు ఇతర తహశీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది పలు అంశాలపై ఆమెతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా లెక్కలతో పోలిస్తే 95% అప్లికేషన్లు వచ్చినట్లు తెలిపారు. అధికారులు సర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేస్తున్నారని ప్రశంసించారు. ఆర్డీవో అరుణకుమారి, తహశీల్దార్ ఆర్.వి.ప్రసాద్, కమిషనర్ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.



రేఖరాణి



వై.యస్. విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైకాపా నేతలు

# మరపురాని మహానేత వై.యస్

గూడూరు రూరల్ మండలం తిప్పవరప్పాడు కూడలి వద్ద ఈ నెల 2న డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. వైఎస్సార్సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొని వై.యస్. విగ్రహం వద్ద నివాళులర్పించి, మరపురాని మహానేత వై.యస్ అంటూ ఆయన సేవలను కొనియాడారు. రూరల్ కన్వీనర్ మల్లు విజయకుమార్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మెట్ట రాధారెడ్డి, జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీపీ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులదే కీలక పాత్ర



లీగ్‌ని ప్రారంభిస్తున్న మయూరి శ్యాంయాదవ్

గూడూరు పట్టణంలోని అల్లూరు ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఇటీవల కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ మయూరి శ్యామ్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం అందించడంలో క్రీడలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కడివేటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# రోటరీ సభ్యులకి ఓరియంటేషన్ సెమినార్




సెమినార్‌ని ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

రోటరీ క్లబ్, గూడూరు వారి ఆధ్వర్యంలో ఇటీవల అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవన్‌లోని బొమ్మరెడ్డి రోటరీ కన్వెన్షన్‌లో నెల్లూరు మరియు గూడూరు రోటరీ జోన్స్‌కి చెందిన 10 క్లబ్‌లలోని సుమారు వందమంది కొత్త రోటరీ సభ్యులకి ఓరియంటేషన్ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కి రోటరీ క్లబ్ అధ్యక్షులు తిరుమూరు సురేష్‌రెడ్డి అధ్యక్షత వహిస్తూ కొత్త రోటరీ సభ్యులకి అనేక విషయాలు తెలియజేసి వారిలో రోటరీ సేవల పట్ల అవగాహన పెంచేందుకు కృషి చేశారు. సెమినార్ ఛైర్మెన్ & న్యూ మెంబర్ ఓరియంటేషన్ ఛైర్మెన్, ఆంధ్ర రోటరీ క్లబ్‌కి చెందిన ఎన్.బాలకృష్ణంరాజు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు దొడ్ల భరత్ కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొణిదల మునిగిరీష్ తదితర రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

# పౌర హక్కులపై అవగాహన




అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ ప్రసాద్

గూడూరు మండల పరిధిలోని మిట్టాత్మకూరు ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఇటీవల పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గూడూరు తహశీల్దార్ ఆర్.వి.ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరునికి సమాన హక్కులు ఉన్నాయన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనాన్ని పూర్తిగా నిషేధించారని, ప్రతి పౌరుడు సమాన హక్కులు, గౌరవంతో జీవించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సమాజంలో వివక్షకు తావు లేకుండా అందరూ సౌభ్రాతృత్వంతో, పరస్పర గౌరవంతో కలిసి జీవించాలని సూచించారు.

# కళ్యాణ వైభవం...!




అల్లీపురం వాస్తవ్యులు కోడూరు వెంకట సనత్‌కుమార్‌రెడ్డి - శ్రీమతి సాహిత్యల కుమారుడు **మన్మోహిత్‌రెడ్డి - మహితారెడ్డి**ల పరిణయం ఆగస్టు 30వ తేదీ నెల్లూరులో వేడుకగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.




నెల్లూరు వాస్తవ్యులు వేమారెడ్డి శ్రీధర్‌రెడ్డి - శ్రీమతి ప్రవీణల కుమార్తె **డా॥ మనశ్వినిరెడ్డి - డా॥ మౌళీంధర్‌రెడ్డి**ల వివాహం ఆగస్టు 27వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకి 'లాయర్' శుభాకాంక్షలు.




నెల్లూరు వాస్తవ్యులు గణపం రమేష్‌రెడ్డి - శ్రీమతి రమణమ్మల కుమార్తె **దివ్య - వినయ్**ల పెళ్ళి ఆగస్టు 27వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. నవ దంపతులకి 'లాయర్' శుభదీవెనలు.




దుత్తలూరు వాస్తవ్యులు లింగాల నాగిరెడ్డి - శ్రీమతి వెంకట సుబ్బమ్మల కుమారుడు **వెంకటేశ్వరరెడ్డి - సౌమ్య**ల కళ్యాణం ఆగస్టు 30వ తేదీ నర్రవాడలో వేడుకగా జరిగింది. నవ వధూవరులకి 'లాయర్' శుభాభినందనలు.

# 'సత్య'కి మరో కొత్త బాధ్యత

## 'సేవా సంకల్ప్ అభియాన్' దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా నియామకం



అటు బీజేపీ పార్టీలోనూ, ఇటు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రిగానూ ఎంతో సమర్ధవంతంగా పనిచేస్తున్న సత్యకుమార్‌యాదవ్‌కి బీజేపీ అధిష్టానం తాజాగా మరో కొత్త బాధ్యత కట్టబెట్టింది. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'సేవాసంకల్ప్ అభియాన్' కార్యక్రమాల దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా ఆయన నియమితులు కావడం విశేషం. ప్రధాని నరేంద్రమోడీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ళ ప్రజాసేవని పూర్తిచేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఈనెల 17 నుంచి అక్టోబరు 17 వరకు పెద్దఎత్తున 'సేవా సంకల్ప్ ఉత్సవాలు' నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరిలతో సహా అండమాన్, లక్షద్వీప్‌లలో కూడా ఈ కార్యక్రమాల అమలు బాధ్యతలను సత్యకుమార్ పర్యవేక్షించనున్నారు. పార్టీలో సముచిత స్థానంతో పాటు, కొత్త బాధ్యతలు చేపట్టనున్న సత్యకుమార్‌కు పార్టీవర్గాలు శుభాకాంక్షలు తెలిపాయి.

# కలెక్టర్ అంటే..ఇలా ఉండాలి!

- రోడ్డుప్రమాదంలో గాయపడ్డవారికి తక్షణ సాయం

కలెక్టర్ అంటే ఇలా ఉండాలని నిరూపించుకున్నారు మన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల. సాధారణంగా రోడ్డు ప్రమాదం జరిగితే వెంటనే అక్కడికి వెళ్ళేది పోలీసులే. ఆ తర్వాత ఆసుపత్రిలో చేరాక అధికారులు కూడా పెద్దగా పట్టించుకోరు. కానీ, జిల్లా కలెక్టర్ అలా కాదు, రోడ్డుప్రమాద బాధితులను ఆసుపత్రికి తీసుకొచ్చారన్న సమాచారం విన్న వెంటనే హడావిడిగా సర్వజన ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. వివరాల్లోకి వెళ్తే, ఈనెల 1వ తేదీ బుజబుజనెల్లూరు వద్ద వాహనం బోల్తాపడి అందులో ఉన్న జార్ఖండ్ వాసులు 17 మంది గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వెంటనే కలెక్టర్ ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించడమే కాక, గాయపడినవారికి తక్షణ సాయంగా 10వేల రూపాయల వంతున సాయం అందించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. వారంతా విద్యుత్‌లైన్ల మార్పిడి పనుల కోసం జార్ఖండ్ నుంచి నెల్లూరుకు వచ్చారు. ప్రమాద ఘటనపై విచారణ జరపాలని డీఎస్పీని, ఆర్డీఓని, కార్మికశాఖాధికారిని ఆదేశించారు. కలెక్టర్ స్వయంగా వచ్చి సాయం అందించడంతో బాధితులు ఆయనకు కన్నీటితోనే కృతజ్ఞతలు చెప్పుకున్నారు.



బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల

# అనాధ పిల్లలకి.. డిఎస్ఆర్ ట్రస్ట్ కానుకలు

రాఖీ పౌర్ణమి పండుగను డిఎస్ఆర్ ట్రస్ట్ (దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్) వారు ఒక సేవోత్సవంగా నిర్వహించారు. ఆ పండుగను పురస్కరించుకొని ఆగస్టు 28వ తేదీ సాయంత్రం అల్లూరు మండలం నార్త్‌ఆములూరు అనాధాశ్రమంలో ఉన్న 225 మంది పిల్లలకు తమ ట్రస్ట్ ప్రతినిధులు నూతన వస్త్రాలు, మిఠాయిలను పంపిణీ చేశారు. ఆశ్రమం నిర్వాహకులతో కలసి ట్రస్ట్ వారు ఆ కానుకలను పిల్లలకు అందజేయడంతో, ఆ చిన్నారులెంతో సంతోషించారు. ట్రస్ట్ నిర్వాహకులు దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీఇఓ అనిల్‌కుమార్‌రెడ్డి, స్కిల్‌డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావు, సత్యసాయి ట్రస్ట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకి దుస్తులని పంపిణీ చేస్తున్న డిఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు

## కృష్ణచైతన్య విద్యాసంస్థల్లో..

# సీఏ, సీఎంఏ కోర్సులు

నెల్లూరులోని కృష్ణచైతన్య విద్యా సంస్థల్లో.. నూతనంగా సీఏ, సీఎంఏ కోర్సులను ప్రారంభించారు. విద్యా సంస్థల వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను పెంపొందించుకునేలా నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఏ కోర్సు ప్రారంభించినా.. ఆ కోర్సులో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ.. ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం సీఏ, సీఎంఏ కోర్సులకు మంచి డిమాండ్ ఉందని, వాటిని అభ్యసించిన విద్యార్థులకు పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. చార్టెర్డ్ అకౌంటెంట్ సీఏ టి.శ్రీనివాసులు, సౌత్ ఇండియన్ రీజినల్ కౌన్సిల్ మెంబర్ సీఎంఏ వై.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని ఈ కోర్సులను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యాసంస్థల డీన్లు రామాంజనేయులురెడ్డి, రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఛైర్మెన్ ఆర్.వి.కృష్ణారెడ్డి తదితరులు

# భక్తమహాశయుల హృదయస్పందన

(5వ పేజీ తరువాయి)

సమానత్వ భావన, మానవత్వంతో కూడిన సేవ అంతే. భక్తుడిని క్యూలో ముందుకు కదిలించాల్సి వస్తే కదిలించండి. రద్దీని నియంత్రించాల్సి వస్తే నియంత్రించండి. దర్శన సమయాన్ని పరిమితం చేయాల్సివస్తే చేయండి. కానీ.. "తోసేయడం" అనే పదం భక్తుడి అనుభవంలో భాగం కాకూడదు చూడండి.

## విమర్శల వెనుక భక్తి ఉంది!

ఈ కథనానికి వచ్చిన కొన్ని కామెంట్లు తీవ్రంగా ఉన్నాయి. కొందరి భాషలో ఆగ్రహం కనిపించింది. కొన్ని వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలుగా మారాయి. కొన్ని వ్యాఖ్యలు వ్యక్తిగత ఆవేదనతో నిండిపోయాయి. అయితే ఆ ఆగ్రహం వెనుక కూడా ఒక సమాచారం ఉంది. అది శ్రీవారిపై ఎనలేని భక్తి. స్వామివారిని ఒక్క క్షణం ప్రశాంతంగా చూడాలని కోరుకునే మనసు. ప్రశాంతంగా తమ మొక్కులు చెల్లించుకోవాలనే తపన. తమ పిల్లలతో, తల్లిదండ్రులతో కలిసి స్వామివారి ముందు తనివితీరా నిలబడాలనే కోరిక. అందుకే ఆవేదన ఇంత తీవ్రంగా ఉంది.

అనూహ్యంగా స్పందించిన 'లాయర్' పాఠకులకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ సందర్భంగా 'లాయర్' పత్రిక కథనాన్ని చదివిన ప్రతి ఒక్కరికీ, స్పందించిన ప్రతి హృదయానికి మా కృతజ్ఞతలు. మా మాటతో ఏకీభవించిన వారికి మాత్రమే కాదు. ఏకీభవించని వారికి కూడా ధన్య వాదాలు. ఎందుకంటే మీరు లేవనెత్తిన ప్రశ్నలు మా చర్చను మరింత విస్తృతం చేశాయి. టీటీడీని సమర్థించిన వారికి కూడా ధన్యవాదాలు. ఎందుకంటే.. లక్ష లాది భక్తులకు సేవలందిస్తున్న వ్యవస్థ ఎదుర్కొంటున్న కష్టాలను కూడా మీరు గుర్తుచేశారు. వారి వారి అనుభవాలను పంచుకున్న ప్రతి భక్తుడికి ప్రత్యేక ధన్య వాదాలు. వారు చెప్పిన మాటలు వారివే అయినప్పటికీ, వాటి వెనుక ఇంకెంతో మంది భక్తుల అనుభవాలు ఉండవచ్చని ఈ స్పందనలు సూచిస్తున్నాయి.

## చివరగా ఒక్క మాట...

తిరుమలపై రాసిన ఒక వ్యాసం 1.71 లక్షల మందికి చేరడం, వెయ్యికిపైగా లైక్‌లు రావడం, వందకుపైగా కామెంట్లు రావడం, ఇది 'లాయర్' పత్రిక విజయంగా మాత్రమే చూడటం మాకు ఇష్టం లేదు. ఇది ఒక బాధ్యత. ఎందుకంటే ఇంతమంది చదివారు అంటే, ఇంతమంది ఈ అంశంపై ఆలోచిస్తున్నారు. ఇంతమంది స్పందించారు అంటే, ఈ అంశంపై ప్రజల్లో చర్చ అవసరం ఉందని అర్థం. అందుకే ఈ చర్చ ఇక్కడితో ముగియకూడదు. టీటీడీ కూడా ఈ స్పందనలను ఒక విమర్శగా కాకుండా ప్రజాభిప్రాయంగా చూడాలి. భక్తుల క్యూలు తగ్గాలి. తోపులాటలు తగ్గాలి. సిబ్బంది వ్యవహారశైలిలో మరింత మానవత్వం రావాలి. దర్శన విధానాల్లో పారదర్శకత పెరగాలి. ప్రత్యేక దర్శనాలు, దాతల దర్శనాలు, ప్రోటోకాల్ దర్శనాల విషయంలో స్పష్టత ఉండాలి.

అన్నింటికంటే ముఖ్యంగా సామాన్య భక్తుడి ముఖంలో "స్వామివారిని తృప్తిగా చూశాను" అనే ఆనందం కనిపించాలి. అదే టీటీడీకి నిజమైన విజయ సూచిక. తిరుమలలో ఎంతమంది దర్శనం చేసుకున్నారన్న లెక్క కంటే, ఎంతమంది భక్తులు సంతృప్తిగా దర్శనం చేసుకుని తిరిగి వెళ్లారన్నదే అసలు లెక్క.

మా మాట విన్నందుకు కాదు. మా మాటతో ఏకీభవించినందుకు కాదు. మీ మనసులోని మాటను మాతో పంచుకున్నందుకు మీ అందరికీ మరోసారి ధన్యవాదాలు. మీ స్పందనలే మాకు మరింత బాధ్యతను ఇచ్చాయి. భక్తుల గొంతు వినిపిస్తూనే ఉంటుంది. ప్రశ్నలు అడుగుతూనే ఉంటాం. ఎందుకంటే తిరుమల ఎవరిదో కాదు, కోట్లాది భక్తుల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని కాపాడటం మనందరి బాధ్యత. "ధర్మో రక్షతి రక్షితః."

**ఓం నమో వేంకటేశాయ..!**

# ఆనంని కలిసిన..విద్యుత్‌శాఖ ఎస్ఇ

విద్యుత్‌శాఖ కొత్త ఎస్ఇగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.సుధాకర్ ఈనెల 2న రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆయన శాలువతో సన్మానించారు. అనంతరం, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కలుసుకున్నారు. ఎస్ఇ సుధాకర్‌తో పాటు, ఇఇ అల్తాఫ్, ఏఇ సుధాకర్ పాల్గొన్నారు.



# కలెక్టర్‌కి సన్మానం

రెడ్‌క్రాస్ ద్వారా చేస్తున్న సేవలకు గాను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఇటీవల రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా బంగారుపతకం అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఈనెల 2న నెల్లూరులో ఏపీ ఎన్జీఓల సంఘం నాయకులు బందారుపల్లి వెంకటేశ్వర్లు, గాదిరాజు రామకృష్ణ తదితరులు కలెక్టర్‌ని సన్మానించారు.

# యుద్ధాలపై కవుల తిరుగుబాటే..'యుద్ధం-శాంతి'

యుద్ధం కన్నీటి నదులలో మనుషుల ప్రాణాలను ముంచేసే చీకటి ప్రళయమైతే..శాంతి రేపటి లోకానికి వెలుగునిచ్చే పచ్చని ఉదయం. తుపాకీ గొట్టాలు అనేవి విద్వేషాల మంటలను రగిలిస్తూ మహా స్మశానాలను సృష్టిస్తే, శాంతి కపోతాలు అనేవి మానవాళి హృదయాలలో ప్రేమానురాగాల పంటలను పండిస్తాయి. అందుకే ఆయుధాలను వీడి శాంతి మార్గంలో నడవడమే జగతికి నిజమైన కళ్యాణం అన్న శాంతికాముకుల బాటల్లో "యుద్ధం-శాంతి" కవితా సంకలనంలోని కవులంతా కోరుకుంటున్నారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు 341 మంది ముక్త కంఠంతో నినదిస్తూ శాంతిని కాంక్షిస్తూ రచించిన ఈ "యుద్ధం – శాంతి" అనే కవితా సంపుటికి "జీవనాస్తిత్వ పోరాట కవితా సంకలనం" అని ఒక "ట్యాగ్ లైను" ఇవ్వడంలో భావం – మనిషి బతుకు తెరువు కోసం, తన ఉనికి కోసం, ఆత్మగౌరవం కోసం చేసే నిరంతర సంఘర్షణను ప్రతిబింబించే కవితల సమాహారం. దీనికి ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు రాసిన ముందు మాటలో "యుద్ధం లేని నేల భూగోళం మీద లేదు. హద్దులు దాటిన యుద్ధమో, హద్దుల్లోపల యుద్ధమో, నిరంతరం ప్రపంచంలో జరుగుతూనే ఉంటుంది" అన్న మాట యదార్థం. కె..శివారెడ్డి గారు, ముందు మాటలో "ప్రపంచం ప్రతి అంగుళంలోను యుద్ధ బీభత్సం, శాంతి, నీడ అనేది దొరకదా? మానవుడి జీవితమంతా ఎడారిమయమేనా? అభివృద్ధి అంటే యుద్ధమేనా?" అని ఎంతో ఆవేదన పడ్డారు. ఇక ఆంధ్రజ్యోతిలో గతంలో ప్రధాన సంపాదకులుగా పనిచేసిన కె.శ్రీనివాస్, ప్రపంచంలో గతంలో ఈ మధ్య కాలంలో జరిగిన యుద్ధాలను దాని పరిణామాలను ఏకరువు పెడుతూ తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. ఇక ఈసంకలనానికి సంపాదకత్వం వహించిన డా.జెల్ది విద్యాధర్‌గారు తన ముందుమాటల్లో "సామ్రాజ్య వాదం, జాత్యహంకారం ఎంత ప్రమాదమైనవో ఉగ్రవాదం వాటన్నింటికంటే ప్రమాదకరమైనది అన్నారు. సరికొండ నరసింహరాజు "నెత్తుటితో తడవని దేశముందా!... కన్నీటిలో కాలని దేహముందా? అంటూ ఎప్పటికైనా "యుద్ధభూములన్నీ బుద్ధభూములయ్యేనా? అంటూ గొప్ప కవితాత్మకతతో సంపాదకీయం వ్రాశారు.



వెల : రూ. 300/- పేజీలు : 252
ప్రతులకు:
డా. జెల్ది విద్యాధర్
హైదరాబాద్. సెల్: 94904 69606
శ్రీ సరికొండ నరసింహరాజు
నాగార్జునసాగర్. సెల్: 93982 54545

ముందుగా నానీల సృష్టికర్త డా.ఎన్.గోపి "యుద్ధం జర భద్రం" అంటూ "యుద్ధం మొత్తం ఏ పద్యంలోనూ పట్టదు" అన్నారు. అలాగే "యుద్ధంలో హీరోలుండరు/ ఇద్దరూ విలన్లే/ ఏ పక్షమూ వహించలేము/ ఇద్దరూ శిక్షార్హులే!" అని అంటే, ప్రముఖ దిగంబర కవి నగ్నముని తన కవితలో "యుద్ధంలో గెలిచేది ఎవరు? ఏ దేశమూ కాదు యుద్ధాల్లో గెలిచేది యుద్ధమే!" అనడంలో యుద్ధం వల్ల కలిగే విధ్వంసం, క్రూరత్వం, ద్వేషం, హింస మాత్రమే సామ్రాజ్యాలలో విస్తరించుకుంటాయని చెప్పారు.

సాగర్ శ్రీరాం కవచం "యుద్ధం ఎవరి పరామర్శలు కోరదు యుద్ధం ఓ వైపు / అదో కైపు" అన్నారు. పల్లిపట్టు నాగరాజు "మనసు గూగుల్లో ఎంత వెదికినా యుద్ధానికి పరాకాష్ట!" అన్నారు. శ్రీరాం పుప్పాల "ఊపిరి దీపం తుఫాను గాల్లో/ మిణుకు మిణుకు మంటున్నప్పుడు/ ఎంత ఏడ్పి ఉంటుంది కాలం" అని అడిగారు. బొగ్గరపు రాధాకృష్ణమూర్తి "మతాల చదరంగంలో/ జాతుల రణరంగం జరుగుతుంటే/ ప్రపంచ విపంచిని సవరించి/ శాంతి స్వరాలు పలికించేదెవరు?" అని ప్రశ్నించారు. చిన్ని నారాయణరావు "ఉదయాలు కాలిపోతున్నప్పుడు.. వసంతాల్ని ఉరి తీస్తున్నప్పుడు... మంచికాలంలో... తెరచాప ఎత్తుకో గలగాలి" అనడంలో గొప్ప ఆశాభావం వ్యక్తం చేశారు.

కవులు సమాజానికి ఎప్పుడు ఏ విపత్తు సంభవించినా ఉద్యమాలకు అతీతంగా కలిసిపోయి కవిత్వం రాస్తారు అని ఈ "యుద్ధం – శాంతి" అనే కవితా సంపుటిలో అభ్యుదయ కవులు, విప్లవకవులు, దిగంబర కవులు, స్త్రీవాద కవులు, ముస్లింవాద కవులు, అస్తిత్వవాద కవులు ఋజువు చేశారని తెలియజేయడం ఎంతైనా అభినందనీయం!...



సమీక్ష :
డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
సెల్ : 9490400858



# టూకీగా...

## గండవరంలో..
## రైతులకు అవగాహన

కొడవలూరు మండలం గండవరంలో ఏడీఏ దేవసేనమ్మ ఆధ్వర్యంలో ఈనెల 2న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్ట విత్తనాలు, సబ్సిడీలపై రైతులకు అవగాహన కలిగించారు. మండల వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి తదితరులు పాల్గొని ఈకెవైసీలో రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

## కావలిలో..జనవిజ్ఞాన వేదిక సభ

కావలిలోని రవి నర్సింగ్‌హోమ్‌లో ఈనెల 2న జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) వార్షిక మహాసభ జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఎంవి చలపతి, ప్రధాన కార్యదర్శి విజయకుమార్ పాల్గొని, సమాజంలో మూఢనమ్మకాల పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలని కమిటీ సభ్యులకు సూచించారు. జేవీవీ నాయకులు డా.బెజవాడ రవికుమార్, తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నార్తురాజుపాలెంలో.. వ్యవసాయ మార్కెట్‌కమిటీ సమావేశం

కొడవలూరు మండలం నార్తురాజుపాలెంలో ఈనెల 2న కోవూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం జరిగింది. బోర్డు ఛైర్మన్ బెజవాడ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ తొలి సమావేశంలో మార్కెట్‌యార్డు అభివృద్ధిపై చర్చించారు. రైతుల వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని ఛైర్మన్ చెప్పారు. భవిష్యత్తు కార్యాచరణపై సభ్యులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

## ఏటూరులో..పేకాటరాయుళ్ల అరెస్ట్

చేజర్ల మండలం ఏటూరు గ్రామశివార్లలో ఈనెల2న పేకాటాడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. చేజర్ల ఎస్ఐ అయ్యప్ప ఆధ్వర్యంలో పోలీసులు నిఘాపెట్టి పేకాట రాయుళ్లను పట్టుకుని, వారివద్ద నుంచి 7600 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. జూదం, అసాంఘిక కార్యక్రమాలను సహించేది లేదని ఎస్ఐ స్పష్టం చేశారు.

## ఊటుకూరులో.. అక్రమ మద్యం స్వాధీనం

వింజమూరు మండలంలోని ఊటుకూరు, తక్కెళ్లపాడు గ్రామాలలో ఈనెల 2న ఎక్సైజ్ అధికారులు దాడులుచేసి, అక్రమంగా నిల్వ ఉంచిన 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించి ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## వీరారెడ్డిపాలెంలో.. విద్యుత్ షాక్‌తో రైతు కన్నుమూత

విడవలూరు మండలం వరిణి పంచాయతీ వీరారెడ్డిపాళెంలో ఈనెల 2న రైతు ఉప్పల వెంకటేశ్వర్లు పొలంలో విద్యుత్ షాక్‌కి గురయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరు ప్రమాదవశాత్తూ తగిలి కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సోమశిల డ్యామ్‌లో.. 18.447 టీఎంసీల నీళ్ళు

సోమశిల జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 77.9888 టీఎంసీలు కాగా, ఈనెల 2వతేదీ నాటికి 18.447 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు వెయ్యి, దక్షిణ కాలువకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఎండవేడిమికి రోజుకు సగటున 120 క్యూసెక్కుల నీరు ఆవిరవుతుందని వారు వివరించారు.

## మొగళ్లపాలెంలో.. బాధితులకు దుస్తులు పంపిణీ

నెల్లూరురూరల్ పరిధిలోని మొగళ్లపాళెం గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి వైసీపీ నాయకులు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో బండ్ల రాజేశ్వరప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కసుమూరు ఆరోగ్యకేంద్రం తనిఖీ

కసుమూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి సింహాచలం ఈనెల 1న సందర్శించి రికార్డులు పరిశీలించారు. జ్వరాల కేసులు వస్తే గురించి వైద్యసిబ్బందితో ఆరా తీశారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యాధికారిణులు డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణభారతి – సేవా హారతి

# 25 వసంతాల సేవోత్సవం



25 YEARS OF EMPOWERMENT
CELEBRATING



## స్వర్ణభారత్ ట్రస్ట్

వెంకటాచలం

2001

*సంపూర్ణ గ్రామీణ సాధికారత...*

## ఆహ్వానం

సేవా "దీప" కాంతులు – సాధికార "స్వర్ణ" కాంతులు
శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి మానసపుత్రికగా ప్రభవించి
శ్రీమతి దీపా వెంకట్ గారి సమర్థవంతమైన నాయకత్వ పర్యవేక్షణలో సేవా చంద్రికలను నలుదిశలా వెదజల్లుతూ...
పేదలు, మహిళలు, రైతులు మరియు గ్రామీణ యువత జీవితాల్లో సుస్థిర వెలుగులు నింపిన స్వర్ణభారత్ ట్రస్ట్
25 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం!

**సాయంత్రం గం. 3.30 ని.లకు | తేది: 7 సెప్టెంబర్, 2026, సోమవారం**

వేదిక: ప్రజా మందిరం, స్వర్ణభారత్ ట్రస్ట్, వెంకటాచలం, నెల్లూరు.

### అధ్యక్షులు

**శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు**
భారతదేశ గౌరవ 13వ ఉపరాష్ట్రపతి

### ముఖ్య అతిథి

**శ్రీ యోగి ఆదిత్య నాథ్ గారు**
గౌరవ ముఖ్యమంత్రి, ఉత్తరప్రదేశ్.

### గౌరవ అతిథులు

**శ్రీ పొంగూరు నారాయణ గారు**
గౌరవ పురపాలక & పట్టణాభివృద్ధి శాఖామాత్యులు, ఆం.ప్ర.

**శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారు**
గౌరవ దేవాదాయ శాఖామాత్యులు, ఆం.ప్ర.

### ఆత్మీయ అతిథులు

**శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు**
గౌరవ లోక్‌సభ సభ్యులు

**శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారు**
గౌరవ శాసనసభ సభ్యులు

**శ్రీ బీద మస్తాన్ రావు గారు**
గౌరవ రాజ్యసభ సభ్యులు

**శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారు**
గౌరవ శాసనసభ సభ్యులు

**శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి గారు**
గౌరవ లోక్‌సభ సభ్యులు

**శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు**
గౌరవ శాసనసభ సభ్యులు

**శ్రీ కామినేని శ్రీనివాస్**
చైర్మన్ – స్వర్ణభారత్ ట్రస్ట్.

**శ్రీమతి దీపా వెంకట్**
మేనేజింగ్ ట్రస్టీ – స్వర్ణభారత్ ట్రస్ట్.

సంప్రదించుటకు:
శ్రీ సురేంద్ర రెడ్డి - 94402 75274 | శ్రీ జనార్ధన్ రాజు - 94404 25225 | శ్రీ నాగరాజ రెడ్డి - 92464 35789 | శ్రీ విక్రాంత్ - 81304 55777
శ్రీ చైతన్య - 90308 48284 | శ్రీ విజయ్ మోహన్ సూరి - 98492 16626 | శ్రీ గోపిచంద్ - 99632 77544

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com